ప్రజాశక్తి

ఆదివారం 18 ఫిబ్రవరి 2024 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

సిఎం జగన్ పర్యటన వాయిదా.?

23 లేదా నెలాఖరులో జరిగే అవకాశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఈ నెల 20న ఒంగోలులో జరగాల్సిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పర్యటన వాయిదా పడింది. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయానికి అధికారికంగా సమాచారం అందింది. ఈ నెల 23 లేదా నెలాఖరులో సిఎం పర్యటన ఉండవచ్చని తెలుస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఒంగోలులో 22 వేల మందికి ఇళ్ళ పట్టాల పంపిణీలో పాల్గొనేందుకు ఈ నెల 20వ తేదీ వస్తారన్న సమాచారంతో అధికారులు సిఎం పర్యటనకు యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు చేశారు. కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, జిల్లా ఎస్‌పి పి.పరమేశ్వర రెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డితో కలసి అధికారులకు సిఎం పర్యటన ఏర్పాట్లపై దిశా నిర్దేశం చేశారు. శనివారం కలెక్టర్ దినేష్‌కుమార్‌తో పాటు జిల్లా ఎస్‌పి పరమేశ్వర రెడ్డి సిఎం పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షించారు. అయితే ముఖ్యమంత్రికి బిజీ షెడ్యూల్ కారణంగా ఈనెల 20వ తేదీ జరగాల్సిన ఒంగోలు పర్యటన వాయిదా పడినట్లు తెలుస్తోంది. ఈ నెల 18న అనంతరపురం జిల్లా రాప్తాడులో సిఎం పర్యటన ఉంది. తరువాత వరుసగా వివిధ జిల్లాలలో సిఎం పర్యటనలు ఖరారయ్యాయి. ఒంగోలులో సిఎం పర్యటన ఈనెల 23 లేదా నెలాఖరులో జరిగే అవకాశాలు కల్పిస్తున్నాయి. వెలిగొండ ప్రాజెక్ట్ నిర్మాణ పనులు పూర్తి కావటంతో ప్రాజెక్ట్‌ను ప్రారంభించటంతో పాటు ఒంగోలులో పేదలకు ఇళ్లస్థలాల పంపిణీ కార్యక్రమాన్ని ఒకే రోజు సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేపట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి.

గెలుపు మనదే..అనుమానమొద్దు..

- ఈ బకాసురుడు ఏదీ వదిలిపెట్టడు..
- నా రాజకీయ అనుభవం ముందు జగన్ ఒక బచ్చా..
- 'రా..కదలిరా' బహిరంగ సభలో తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు
- ఎమ్మెల్యే ఏలూరికి ప్రశంసలు



'రా..కదలిరా..' బహిరంగ సభలో పాల్గొన్న ప్రజలు, మాట్లాడుతున్న చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి-ఇంకొల్లు, బాపట్ల జిల్లా

'రాబోయే ఎన్నికల్లో గెలుపు మనదే.. అసలు అనుమానమే లేదు.. పర్చూరులో ఎన్నికలకు ముందే గెలుపు ఖాయమైంది' అని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. రాష్ట ముఖ్యమంత్రి జగన్ ఒక సైకో అని, ఏపీని చెరబట్టి వ్యవస్థలను నాశనం చేశారని చెప్పారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు హీరోలా పోరాడుతున్నాడని కితాబిచ్చారు. శనివారం ఇంకొల్లులో నిర్వహించిన 'రా ..కదిలి రా' బహిరంగ సభలో చంద్రబాబు ప్రసంగించారు. జగన్‌కు కౌంట్ డౌన్ ప్రారంభమైందని, ఇంకా 52 రోజులే మిగిలి ఉన్నాయని చెప్పారు. 52 రోజుల తర్వాత టీడీపీ - జనసేన కూటమి అధికారంలోకి వస్తుందని తెలిపారు. రాజకీయాలను జగన్ కలుషితం చేశారని.. అలాంటి వ్యక్తిని ఓడించాలని చంద్రబాబు పిలుపునిచ్చారు.

ఈ బకాసురుడు ఏదీ వదిలిపెట్టడు..

'జగన్ నీ పని, నీ పార్టీ పని ఫినిష్.. పరదాలు కట్టుకొని తిరగడం కాదు.. ధైర్యం ఉంటే స్వచ్ఛందంగా వచ్చిన ప్రజలను చూడు. జగన్ నీకు ఇవే చివరి రోజులు. పర్చూరు సభను చూస్తే నీకు రాత్రుళ్లు నిద్ర రాదు. నీ డబ్బు సంచులు, నీ దౌర్జన్యాలు, నీ అధికార దుర్వినియోగం,అక్రమ కేసులు ఆపలేవు. ప్రజల్లో నీ పాలనపై కసి, తిరుగుబాటు కనిపిస్తోంది. పోలీసులు పారాహుషారుగా ఉండాలి. పోయే ప్రభుత్వాన్ని మోస్తే మునిగిపోయేది మీరే..' అని చంద్రబాబు అన్నారు. పర్చూరు సభ కోసం భూమి ఇచ్చిన కౌలు రైతు వెంకట నారాయణను అభినందిస్తున్నామన్నారు. 'నా రాజకీయ అనుభవం ముందు జగన్ ఒక బచ్చా. జగన్ తండ్రే నాకు భయపడ్డాడు. అలాంటి బచ్చాకు నేను భయపడను. తండ్రిని అడ్డం పెట్టుకుని రూ. 43 వేల కోట్లను జగన్ దోచుకున్నాడని సీబీఐ, ఈడీ చెప్పింది. ఎంత దోచుకున్నా ఈ మనిషిలో మార్పు రాలేదు.' అని పేర్కొన్నారు. ల్యాండ్, శ్యాండ్, వైను, మైన్.. ఏది దొరికినా వదిలిపెట్టడు ఈ బకాసురుడు అని, జగన్‌కు ఉదయం అల్పాహారం ఇసుక, మధ్యాహ్నం భోజనం మైన్స్, రాత్రికి జే బ్రాండ్ మద్యం కావాలని చంద్రబాబు ఎద్దేవా చేశారు.

రౌడీయిజం చేస్తే ఊరుకునేది లేదు

'రాష్ట్రవ్యాప్తంగా పులివెందుల పంచాయితీ చేస్తావా? మీరు చొక్కాలు మడతపెడితే మా వాళ్ల కుర్చీలు మడతపెడతారు..' అంటూ సీఎం జగన్‌ను చంద్రబాబు హెచ్చరించారు. ఆనాడు తాను అడ్డుకొని ఉంటే జగన్ పాదయాత్ర చేయగలిగేవాడా? అని ప్రశ్నించారు. రాజకీయాల ముసుగులో రౌడీయిజం చేస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. ప్రజలకు సేవ చేసే వాలంటీర్లను తాము అభినందిస్తామని, కానీ వైసీపీకి సేవ చేసే వాలంటీర్లపై తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని అన్నారు. టీడీపీ వచ్చాక పేదలను ఆదుకుంటామని, రెండు సెంట్ల స్థలం ఇచ్చి, ఇళ్లు కట్టించి ఇస్తామని హామీ ఇచ్చారు.

షెడ్యూల్ ఎప్పుడు వచ్చినా..

ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధమవ్వాలి

- రానున్న 15 రోజులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలి
- కలెక్టర్ రంజిత్‌బాషా



కలెక్టర్ రంజిత్‌బాషా

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

రానున్న సాధారణ ఎన్నికల నిర్వహణకు అన్ని వనరులూ సమకూర్చుకొని అధికారులు సంసిద్ధంగా ఉండాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులు, ఏఈఆర్‌ఓల సమావేశం శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో జరిగింది. ఎన్నికల షెడ్యూల్ ఏ సమయంలో వచ్చినప్పటికీ జయప్రదంగా ఎన్నికలు నిర్వహించడానికి అధికారులు సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలని కలెక్టర్ చెప్పారు. ఓటర్ల జాబితాలో చేర్పులు, సవరణల కొరకు నమోదైన దరఖాస్తులను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని ఆదేశించారు. రానున్న 15 రోజులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని, క్లిష్టమైన పరిస్థితులుగా భావించి పనిచేయాలన్నారు. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమయ్యే ఎనిమిది రోజుల ముందు వరకు నూతన ఓటర్ల చేర్పులకు అనుమతి ఉంటుందన్నారు. మతుల ఓట్ల తొలగింపులో రెండు శాతం మించితే ఈఆర్‌ఓలు స్వయంగా పరిశీలించి వ్యక్తిగత బాధ్యతతో చర్యలు తీసుకోవాలన్నారు. వేమూరులో 911, బాపట్లలో 1,119, పర్చూరులో 1,677, అద్దంకిలో 2,017, చీరాలలో 1,586 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండటంపై ఆరా తీశారు. ఈఆర్‌ఓల వద్ద ఎట్టి పరిస్థితుల్లో దరఖాస్తులు పెండింగ్‌లో ఉండరాదన్నారు. పోలింగ్ కేంద్రాలను తహశీల్దార్లు విధిగా పరిశీలించి కనీస సౌకర్యాలపై ఈనెల 27వ తేదీలోగా నివేదిక ఇవ్వాలన్నారు.

అసెంబ్లీ నియోజకవర్గాలలో ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్, స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు చేసుకోవాలని ఈఆర్వోలను కలెక్టర్ రంజిత్ బాషా ఆదేశించారు. రూట్ మ్యాప్ పంపాలని, కమ్యూనికేషన్ వ్యవస్థపై రూపొందించిన ప్రణాళికపై ఈ నెల 20వ తేదీ నాటికి నివేదిక ఇవ్వాలన్నారు. 1,400 ఓట్లు దాటిన పోలింగ్ కేంద్రాలు జిల్లాలో 12 ప్రాంతాల్లో ఉన్నాయని, ఎన్నికల నాటికి ఆగ్జిలరీ పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోకుండా ప్రభావితం చేసే వ్యక్తులు, ప్రాంతాలను సెక్టార్ ఆఫీసర్లు గుర్తించాలన్నారు. లా అండ్ ఆర్డర్ సమస్య ఉన్న పోలింగ్ కేంద్రాలను తీవ్ర సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించాలన్నారు. మైక్రో అబ్జర్వర్లు, వెబ్ కాస్టింగ్, వీడియో గ్రాఫర్లు, స్వీప్ క్యాంపస్ అంబాసిడర్లు, బూత్ స్థాయి అవగాహన బందాలను ఈనెల 26వ తేదీలోగా నియమించుకోవాలన్నారు. సెక్టార్ ఆఫీసర్లకు మెజెస్టీరియల్ అధికారాలు ఇస్తామన్నారు. సెక్టార్ అధికారులకు సమర్థంగా శిక్షణలివ్వాలని పలు సూచనలు చేశారు.

అత్యంత పారదర్శకంగా ఎన్నికలు నిర్వహణకు అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అన్నారు. ఒక్కొక్క నియోజకవర్గానికి 9 చొప్పున ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌లను నియమించాలని ఈ ఆర్ ఓ లను ఆయన ఆదేశించారు. మూడు చొప్పున ▶ 2లో



కలెక్టరేట్ వద్ద ధర్నాలో పాల్గొన్న ఉద్యోగులు

డిమాండ్ల సాధన కోసం

20న ఉద్యోగుల ధర్నా

- జెఎసి ఛైర్మన్ కె.శరత్‌బాబు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఈ నెల 20న ఒంగోలు కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని జెఎసి జిల్లా ఛైర్మన్, ఎపి ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షులు కె.శరత్‌బాబు పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల సంయుక్త కార్యాచరణ సమితి పిలుపు మేరకు ఒంగోలు కలెక్టరేట్ వద్ద జెఎసి ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి ఒంగోలు నగర అధ్యక్షులు కొత్తపల్లి మంజేష్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా కె.శరత్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగులకు రావలసిన జిపిఎలు, ఎపిజిఎల్, పిఆర్‌సి, డిఎ బకాయిలు చెల్లించకపోవటం దారుణమన్నారు. ఎంప్లాయీస్ హెల్త్ కార్డులతో ఎలాంటి ఉపయోగం లేదని, ప్రజలకు ఇచ్చిన ఆరోగ్యశ్రీ కార్డులతో లబ్ధి జరుగుతోందన్నారు. ఆరోగ్యశ్రీ కార్డులతో ప్రజలకు రూ.25 లక్షల వరకు వైద్య సదుపాయాలు పొందే అవకాశం ఉందని, ఎంప్లాయీస్ హెల్త్ కార్డులతో కేవలం రూ.2 లక్షల వరకు మాత్రమే ఫీజు రీయంబర్స్‌మెంట్ వస్తుందన్నారు. వైద్య సదుపాయాలు అందక ఉద్యోగులు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాబోయే రోజులలో ఉద్యోగులకు రావలసిన అన్ని బకాయిలు చెల్లించకపోతే ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ నెల 20వ తేదీన అన్ని జిల్లా కేంద్రాలలో జరిగే ధర్నాలో ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. అదేవిధంగా ఈ నెల 27న సిఎం కార్యాలయ ముట్టడిలో ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని ▶ 2లో



సబ్‌కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న సర్పంచులు

అటవీ శాఖ అధికారులు ఇబ్బంది పెడుతున్నారు

సబ్‌కలెక్టర్‌కు సర్పంచుల వినతి

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

అటవీ ప్రాంతంలో గల చెంచు గిరిజన గూడేల్లో మంజూరైన బోర్లు, పక్కా గృహాలను నిర్మించుకోకుండా అటవీ శాఖాధికారులు తమను ఇబ్బంది పెడుతున్నారని చింతల, కొర్రపోలు సర్పంచ్‌లు భూమని వెంకటయ్య, భూమని వెంకటమ్మ తెలిపారు. ఈ మేరకు శనివారం పెద్దదోర్నాల వచ్చిన సబ్ కలెక్టర్ రాహుల్ మీనాకు వినతి పత్రం అందజేశారు. తమ గోడు వినిపించారు. అటవీ శాఖ అనుమతులు లేనందున బోర్లు వేయడం, పక్కా గృహాలు నిర్మించుకోవడం కుదరదని, మంజూరైన వాటిని సైతం నిలిపివేస్తున్నారని తెలిపారు. దీంతో నిధులు వెనుకకు పోయే ప్రమాదం ఉందన్నారు. గిరిజనుల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకొని బోర్లు, పక్కా గృహాలు నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

సిఎం సహాయ నిధి పంపిణీ

ప్రజాశక్తి-దర్శి

తాళ్లూరు మండలం బెల్లంకొండవారిపాలెం గ్రామానికి చెందిన గువ్వల వెంకట సుబ్బారెడ్డికి మంజూరయిన రూ.3 లక్షల సిఎం రిలీఫ్ ఫండ్‌ను వైసిపి దర్శి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ తూము సుబ్బారెడ్డి, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధమవ్వాలి

(మొదటిపేజీ తరువాయి)

స్టాటిస్టికల్ సర్వేలెన్స్ టీమ్ లు, మైక్రో అబ్జర్వర్లను నియమించాలన్నారు. హోమ్ ఓటింగ్ విధానం కొరకు పోలింగ్ కేంద్రాల వారీగా దివ్యాంగులను మ్యాపింగ్ చేయాలన్నారు. మానవ వనరులను సమకూర్చుకోవాలని ఆయన పలు సూచనలు చేశారు. అర్హులైన పేదలందరికీ ఇంటి నివేశన స్థలాలు ఈనెల 20వ తేదీన పంపిణీ చేయడానికి అధికారులు ఏర్పాట్లు చేయాలని జిల్లా సంయుక్త కలెక్టర్ సిహెచ్.శ్రీధర్ తెలిపారు. ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఆన్ లైన్‌లో నిక్షిప్తం చేయాలన్నారు. తక్షణమే వారికి పట్టాలు ఇచ్చే ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు, జిల్లా అధికారులు, ఈఆర్వోలు, ఏ ఈ ఆర్ ఓ లు, తదితరులు పాల్గొన్నారు.

20న ఉద్యోగుల ధర్నా

(మొదటిపేజీ తరువాయి)

కోరారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వీరాంజనేయులు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. చలో విజయవాడలో పాల్గొన్న తరువాత ఉపాధ్యాయులపై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందన్నారు. ఉద్యోగులకు రావాల్సిన పిఆర్‌సి బకాయిలు, డిఎ బకాయిలు, ఎపిజిఎల్ బకాయిలు వెంటనే చెల్లించాలని, ఉద్యోగులు భవిష్యత్తులో చేపట్టే ఆందోళన కార్యక్రమాలకు యుటిఎఫ్ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ బాధ్యులు వెంకటేశ్వర్లు, ఆడిట్ శాఖ బాధ్యులు ఏడుకొండలు, పశు సంవర్ధక శాఖ బాధ్యులు రోజ్ కుమార్, కిషోర్, సునీల్, సుబ్బారావు, చల్లా శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ ఉద్యోగు సంఘ అధ్యక్షులు, సాగర్ రెడ్డి, మహిళా సంఘ రాష్ట్ర కన్వీనర్ మాధవి, కోటేశ్వరమ్మ, భారతి, ఉదయలక్ష్మి, శిరీషా, శీను, పట్టణ సంఘ కార్యదర్శి షేక్ మగ్దుం షరీఫ్, విజయ్, నాగరాజు, సాల్మన్ రాజు, రామాంజనేయులు, ప్రసన్న, ఉద్యోగులు పాల్గొన్నారు.

వైసిపి ప్రభుత్వంతోనే సంక్షేమం: బూచేపల్లి

ప్రజాశక్తి-ముండ్లమూరు

సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరాలంటే వైసిపి ప్రభుత్వాన్ని గెలిపించాలని జిల్లా పరిషత్ ఛైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. మన ఊరికి మన శివన్న ప్రచార కార్యక్రమంలో భాగంగా మండలంలోని నూజెల్లపల్లి, సుంకరవారి పాలెం గ్రామాల్లో శనివారం ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకాయమ్మ మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందాలన్నా ప్రతి ఇంటికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అందాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి శివప్రసాదరెడ్డిని గెలిపించాలని, జగన్‌ను ముఖ్యమంత్రిని చేయాలని ఆమె అన్నారు. గ్రామాలలో ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే వాటిని పరిష్కరిస్తామని అన్నారు. దర్శి ఇన్‌చార్జి బూచేపల్లి శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ తమ కుటుంబం గత పదిహేను సంవత్సరాల



మాట్లాడుతున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

నుంచి దర్శి నియోజక వర్గ ప్రజలకు సేవలు చేసిందని అన్నారు. ఇంకొకసారి తమకు ఓటు వేసి బూచేపల్లి కుటుంబాన్ని ఆదరించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి రత్నరాజు, సర్పంచ్ వెంకటేశ్వర్లు, ఎంపిపి సుంకర సునీత బ్రహ్మానందరెడ్డి, వైస్ ఎంపిపి బంకా నాగిరెడ్డి, నాయకులు శ్రీనివాసరెడ్డి, మేకల వెంకటేశ్వరరెడ్డి, రమణారెడ్డి, నిడమానూరు చెంచయ్య పాల్గొన్నారు.

ఎస్‌పిని కలిసిన వైసీపీ కనిగిరి ఇన్‌ఛార్జి దద్దాల

ప్రజాశక్తి-కనిగిరి

ఇటీవల జిల్లా ఎస్పీగా నియమితులైన పరమేశ్వరరెడ్డిని ఆయన కార్యాలయంలో కనిగిరి వైసీపీ ఇన్‌ఛార్జి దద్దాల నారాయణ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. దద్దాల నారాయణ యాదవ్ వెంట ఎస్పీని కలిసిన వారిలో కనిగిరి



ఎస్‌పిని కలిసిన దద్దాల

జడ్పిటిసి, జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు మడతల కస్తూరిరెడ్డి, జడ్పిటిసిల సంఘం జిల్లా అధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి, సిఎస్పురం జడ్పిటిసి మేకల శీను, వైసీపీ నాయకులు కల్లూరి రామిరెడ్డి, గట్ల విజయభాస్కర్‌రెడ్డి అంబటి కొండారెడ్డి, పిల్లి లక్ష్మీనారాయణ రెడ్డి, గోబ్బేల్ల శ్రీను, నాగార్జునరెడ్డి, డేవిడ్, గుడిపాడు సర్పంచ్ నాగేంద్రరెడ్డి, గురువాజీపేట సర్పంచ్ రవి తదితరులు ఉన్నారు.

'ఎడెక్స్'తో చేసిన ఒప్పందాన్ని రద్దు చేయాలి: ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఎడెక్స్ సంస్థతో ఉన్నత విద్యలో ఆన్‌లైన్ కోర్సుల ఒప్పందాన్ని రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ వినోద్ డిమాండ్ చేశారు. అంతర్జాతీయ ప్రమాణాల ముసుగులో ప్రభుత్వ విద్యారంగంలో ప్రైవేట్ సంస్థల జోక్యం, ఆన్‌లైన్ కోర్సుల విధానం తీసుకురావడం వంటి చర్యలతో ప్రభుత్వ విద్యా రంగానికి నష్టం వాటిల్లుతుందని అన్నారు. ఇప్పటికే జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత డిగ్రీ చేరే విద్యార్థుల సంఖ్య లక్ష మందికి పడిపోయిందని, నాలుగేళ్ల డిగ్రీతో డ్రాపౌట్స్ పెంచుతుందని అన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేసి, అధ్యాపకులను నియమించి డిగ్రీ విద్యను వాటి ప్రమాణాలు పెంచేందుకు కృషి చేయాలని అన్నారు. ఆన్‌లైన్ కోర్సుల పేరుతో ఎడెక్స్ సంస్థతో ఒప్పందం మరింత ఆందోళన కలిగిస్తోందని వాపోయారు. టెక్నాలజీ ఎప్పటికీ టీచర్‌కు ప్రత్యామ్నాయం కాదని యునెస్కో విడుదల నివేదికలో వెల్లడించిందన్నారు. కోవిడ్ సమయంలోనే ఆన్‌లైన్ కోర్సులతో విద్యార్థులు చదువు దూరమయ్యారని ఆందోళన చెందుతున్న నేపథ్యంలో ప్రస్తుతం ఆన్‌లైన్ కోర్సులు తీసుకురావడం ఏమిటని ప్రశ్నించారు. ఇది ప్రభుత్వ విద్యను నీరుగార్చి, ప్రైవేట్ సంస్థలను ప్రోత్సహించి భవిష్యత్తులో విద్యను పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో తీసుకుని వచ్చేందుకేనని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే వందల కోట్లు ముట్టచెప్పిన బైజూస్ ఒప్పందంతో విద్యార్థులకు కొత్తగా ఒరిగిందేమీ లేదని ఎద్దేవా చేశారు. ఇదే మాదిరిగా ఎడెక్స్ కంపెనీకి కోట్ల రూపాయలు కట్టపెట్టేందుకే ఈ ఒప్పందం చేశారని, కేవలం ఎన్నికల్లో లబ్ధి కోసమేనని అన్నారు. విద్యార్థులకు నష్టం వాటిల్లే ఈ ఒప్పందాన్ని వెంటనే రద్దు చేయాలని, ఆన్‌లైన్ కోర్సుల విధానం ఆలోచన విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళనకు సిద్ధమవుతామని వినోద్ హెచ్చరించారు.

పారిశుధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి-గిద్దలూరు

పట్టణంలో పారిశుధ్య కార్మికులు విధులు నిర్వహించే సమయంలో సురక్షిత ప్రమాణాలు పాటిస్తూ బాధ్యతగా విధులు నిర్వర్తించాలని కార్మికులకు మున్సిపల్ కమిషనర్ వి శ్రీనివాసరావు సూచించారు. శనివారం ఉదయం ఆయన పట్టణంలోని పలు వీధులలో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పారిశుధ్య కార్మికులకు పలు సూచనలు సలహాలు అందజేస్తూ విధుల్లో పాల్గొనేటప్పుడు ఆరోగ్యంపై దృష్టి సారించాలని, గ్లౌజ్‌లు తదితర రక్షణ వస్తువులను వాడాలని సూచించారు. నిర్దేశిత ప్రాంతాల్లో విధులు కచ్చితంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ టపావలి, వార్డు శానిటేషన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

మండల పరిధిలోని కోలబీములపాడు గ్రామంలో అక్రమంగా మద్యం నిల్వ ఉంచి గ్రామస్తులకు విక్రయిస్తున్నాడని సమాచారం మార్కాపురం గ్రామీణ పోలీసులకు రాగా ఎస్ఐ ఎం వెంకటేశ్వర నాయక్ సిబ్బందితో కలిసి శనివారం గ్రామంలోని విక్రేత ఇంట్లో సోదాలు చేయగా 11 బాటిళ్ల అక్రమ మద్యం లభించింది. ఈ మేరకు నిందితుడిని అదుపులోకి తీసుకొని మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడిలో ఎస్ఐ వెంట పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వైసీపీ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-దొనకొండ

స్థానిక అంబేద్కర్ విగ్రహం సెంటర్‌లో వైసీపీ కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభిస్తామని వైసీపీ మండల ఇన్‌ఛార్జి కె రమణారెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సోమవారం సాయంత్రం 6 గంటలకు జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిల ఆధ్వర్యంలో మన ఊరికి మన శివన్న కార్యక్రమంలో భాగంగా ప్రచార కార్యక్రమం జరుగుతుందన్నారు. దొనకొండ పంచాయితీ పరిధిలోని అన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

కరుణాకర్‌రెడ్డితో ఎమ్మెల్యే స్వామి చర్చలు

టీడీపీలోకి రావాలని ఆహ్వానం ● అనుచరులతో చర్చించి వస్తామన్న నేతలు

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ వైసిపి నాయకులు ప్రముఖ వ్యాపారవేత్త దొడ్డ కరుణాకర్‌రెడ్డితో ఆయన తనయుడు, మూలగుంటపాడు గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు దొడ్డ మహేందర్‌రెడ్డితో కొండపి టీడీపీ శాసనసభ్యులు డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి శుక్రవారం రాత్రి వైసీపీ నుంచి టీడీపీలోకి రావాలని కోరారు. అయితే దొడ్డ కరుణాకర్ రెడ్డి తనయుడు, వార్డు సభ్యులు దొడ్డ మహీధర్‌రెడ్డికి ఒంగోలులో వైసీపీ నాయకులు డాక్టర్ బత్తుల అశోక్ కుమార్‌రెడ్డికి గత సంవత్సరం గొడవ జరిగింది. ఈ గొడవలో అశోక్‌కుమార్‌రెడ్డికి గాయాలు కావటంతో దొడ్డ మహేందర్‌రెడ్డి మీద ఒంగోలులో కేసు నమోదు చేశారు. ఆ తర్వాత మహేందర్‌రెడ్డిని వైసిపి నుంచి సస్పెన్షన్ చేయించడం జరిగింది. ఆ తర్వాత వీరి కుటుంబం వైసిపికి దూరంగా ఉంటూ వచ్చింది. దీంతో టిడిపి నాయకులు శాసనసభ్యులు డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తీసుకొని ముందుగా లింగారెడ్డి సతీష్‌రెడ్డిని కలిసి ఆ తర్వాత మూలగుంటపాడులోని అపార్ట్‌మెంట్లో నివాసం ఉంటున్న దొడ్డ కరుణాకర్‌రెడ్డితోనూ, ఆయన తనయుడు, వార్డు సభ్యులు దొడ్డ మహేంద్రరెడ్డితోనూ శాసనసభ్యులు డాక్టర్ స్వామి చర్చించారు. ఇరువురితో మాట్లాడగా తనకు అత్యంత సన్నిహితులుగా ఉన్న ముఖ్యులతో చర్చించి నిర్ణయం చెబుతానని వివరించారు. అయితే దొడ్డ కరుణాకర్‌రెడ్డి మహేందర్‌రెడ్డిలు కందుకూరు శాసనసభ్యులు మానుగుంట మహేందర్‌రెడ్డికి అత్యంత సన్నిహితులు. అయితే ఈ చర్చలు జరుగుతున్న నేపథ్యంలో కందుకూరుకు కొత్త వైసీపీ ఇన్‌ఛార్జి నియామకం విషయం కూడా అప్పుడే సమాచారం రావడంతో ముఖ్యులతో మాట్లాడి వైసీపీని వీడి తెలుగుదేశంలోకి వచ్చే ఆలోచన గురించి వివరిస్తామని ఆయన తెలిపారు. తెలుగుదేశం పార్టీలోకి వస్తే యువ నాయకుడు దొడ్డ మహేందర్‌రెడ్డికి సముచిత స్థానం ఇస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుల ఇళ్లకు తెలుగుదేశం సభ్యులు డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి వెళ్లటం శనివారం వైసిపిలో చర్చకు దారి తీసింది. వీరి వెంట మందలపు గాంధీ చౌదరి, చీమకుర్తి కృష్ణ, షేక్ సనావుల్లా తదితరులు ఉన్నారు.



వైసీపీ నాయకులు కరుణాకర్‌రెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ స్వామి



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జివి కొండారెడ్డి

క్రమశిక్షణ కలిగిన వ్యక్తి వెంకటసుబ్బయ్య

సంతాప సభలో సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

క్రమశిక్షణ, కమిట్మెంట్ ఉన్న వ్యక్తి వెంకటసుబ్బయ్య అని సిపిఎం రాష్ట్ర నాయకులు వై సిద్దయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జివి కొండారెడ్డి, ఎస్‌కె మాబు అన్నారు. సిపిఎం ఒంగోలు నగర కమిటీ మాజీ సభ్యులు దేవరంపాటి వెంకటసుబ్బయ్య సంతాప సభ శనివారం స్థానిక దిబ్బలరోడ్డులో జరిగింది. సిపిఎం నాయకులు వెంకటసుబ్బయ్య చిత్రపటానికి విప్లవజోహార్లు అర్పించి, వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. ఈసందర్భంగా జరిగిన సంతాపభలో సిపిఎం నాయకులు మాట్లాడుతూ వెంకటసుబ్బయ్య 20 ఏళ్ల నుంచి సిపిఎంలో పనిచేస్తూ సత్యనారాయణపురం ఏరియాలో ప్రజలకు సేవలందించారని తెలిపారు. క్రమశిక్షణ, కమిట్మెంట్‌తో పనిచేశారని తెలిపారు. ఇళ్ల స్థలాల పోరాటం, ప్రజలకు మౌళిక వసతులు కావాలని జరిగిన ఉద్యమాలలో పాల్గొన్నారని చెప్పారు. దిబ్బలరోడ్డులో పార్కు కావాలని జరిగిన ఉద్యమంలో పాల్గొన్నారని తెలిపారు. జిల్లాలో రజక వృత్తిదారుల సంఘం స్థాపించి దానికి ప్రథమ అధ్యక్షునిగా ఎన్నికయ్యారని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చీకటి శ్రీనివాసరావు, జిల్లా కమిటీ సభ్యులు కె రమాదేవి, కాలం సుబ్బారావు, ఎపి రజకవృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి ఆర్ మాలకొండయ్య, ఎండి యాసిన్, అజీస్, సిపిఎం నగర కార్యదర్శి జి రమేష్, 48వ డివిజన్ కార్యదర్శి జి బీష్మాచారి, నగర మహిళా సంఘం కార్యదర్శి జి ఆదిలక్ష్మి, నగర కార్యదర్శి వర్గ సభ్యులు దామా శ్రీనివాసులు, తంబి శ్రీనివాసులు, నగర కమిటి సభ్యులు ఎస్‌డి హుస్సేన్, పార్టీ సీనియర్ నాయకులు బి ముసలారెడ్డి, ఎ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మంత్రి నాగార్జునకు అసమ్మతి సెగ

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

నాగులుప్పలపాడులో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి, వైసిపి సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి మేరుగు నాగార్జునకు నాగులుప్పలపాడు మండలంలో అసమ్మతి సెగ తగిలింది. వైసిపి మండల అధ్యక్షులు పోలవరపు శ్రీమన్నారాయణ, పలువురు సీనియర్ నాయకులకు తెలియకుండా మండలంలో మంత్రి కార్యక్రమాలు నిర్వహించడాన్ని నిరసిస్తూ శుక్రవారం రాత్రి మద్దిరాలపాడులో ఆ పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులు అసమ్మతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడుతో పాటు పలువురు మాట్లాడుతూ మండలంలో పలు కార్యక్రమాలు కొంతమంది మాత్రమే చెప్పినట్లు వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ నేపథ్యంలో ఈదుమూడి కార్యదర్శి, వెలుగు ఎపిఎంలను బదిలీ చేయడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. అదేవిధంగా ఇటీవల మండలంలో జరిగిన పలు కార్యక్రమాలకు మాకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా కేవలం కొంతమంది చెప్పిన ప్రకారం నిర్వహించారని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి నాగార్జున మండలంలో పార్టీ కార్యక్రమాలకు వైసీపీ మండల అధ్యక్షులు, సీనియర్ నాయకులను పక్కన పెడుతూ కార్యక్రమాలు నిర్వహిస్తూ పక్కదారి పట్టిస్తున్నారని అన్నారు. వైసిపిలో అవమానాలు పడుతూ ఇలాగే కొనసాగాలా అనే అంశంపై చర్చించారు. మండల పార్టీ అధ్యక్షుడికి తెలియకుండా గ్రామాలలో కార్యక్రమాలను నిర్వహించటం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. అదేవిధంగా మండలంలో అధికారుల బదిలీల వైఖరి సరైంది కాదని, ఆ పద్ధతి మానుకోవాలని సూచించారు. మండల పార్టీ అధ్యక్షులు పోలవరపు శ్రీమన్నారాయణ మాట్లాడుతూ పార్టీకి పనిచేస్తూ అవమానాలు పడుతూ వైసిపిలో ఎందుకు కొనసాగాలని ప్రశ్నించారు. అధికారుల బదిలీలను తక్షణమే ఉపసంహరించుకుంటేనే మంత్రి నాగార్జునతో చర్చలకు కూర్చుంటామని తెలిపారు. మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాల షెడ్యూల్ కూడా తమతో చర్చించలేదని అన్నారు. ఇదేవిధంగా కొనసాగితే మండలంలో జరిగే ఏ కార్యక్రమాలకూ తాము హాజరు కాబోమని తెగేసి చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు ఇనగంటి పిచ్చిరెడ్డి, ఎఎంసి చైర్మన్ మారెళ్ల బంగారుబాబు, పార్టీ సీనియర్ నాయకులు పులిచర్ల పరంధామిరెడ్డి, కోయి హనుమయ్య, కూనం పూర్ణచంద్రరావు, సొసైటీ చైర్మన్ ఉప్పుగుండూరి శ్రీనివాస ప్రసాదు, పెనుబోతు రంగారావు, బత్తుల ప్రసన్న, రాష్ట్ర హౌసింగ్ డైరెక్టర్ కొలకలూరి విజయ్‌కుమార్, మండల జెసిఎస్ కన్వీనర్ కుమ్మూరి సుధాకర్, మాదాసు రాంబాబు, గూడూరి రాంబాబు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, జెసిఎస్ సచివాలయ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

పత్రాలు లేకుండా వాహనాలు నడిపితే చర్యలు: సిఐ

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

సంబంధిత పత్రాలు లేకుండా వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని మార్కాపురం సిఐ ఆవుల వెంకటేశ్వర్లు వాహనదారులను హెచ్చరించారు. శనివారం మార్కాపురం పట్టణ, మండల పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పోలీసులు వాహనాలను తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా లైసెన్స్, ఇన్సూరెన్స్, తదితర పత్రాలు లేని వాహనదారులకు కౌన్సెలింగ్ చేశారు. ఈ సందర్భంగా సిఐ వెంక టేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి ఒక్క వాహనదా రుడు తప్పక రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని అన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పక హెల్మెట్ ధరించి వాహనాలు నడపా లని అన్నారు. కుటుంబ సభ్యులను దృష్టిలో ఉంచుకొని వాహనాలు నడపాలని సూచిం చారు. అదేవిధంగా ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని, అలా కాదని ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తే వాహనాలను తప్పక సీజ్ చేసి కేసు నమోదు చేస్తామని అన్నారు. ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇవ్వరాదని, అలా కాదని వాహనం ఇస్తే వాహన యజమానిపై కూడా కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐ వెంట పట్టణ, రూరల్ ఎస్ఐలు షేక్ అబ్దుల్ రహిమాన్, ఎం వెంకటేశ్వర నాయక్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సిఐ ఆవుల వెంకటేశ్వర్లు

ఆరోగ్య కేంద్రం భవనాలు ప్రారంభం

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలోని ఎనికపాడు గ్రామంలో రూ.64.4 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాలను రాష్ట్ర మంత్రి మేరుగ నాగార్జున శు క్రవారం రాత్రి ప్రారంభిం చారు. రూ.43.6 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని 20.8 లక్షలతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని మంత్రి ప్రారంభించారు. కార్యక్రమా నికి ముందుగా గ్రామంలోని అంబేద్కర్ జ్యోతిరావు పూలే వైఎస్ఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి గ్రామ సర్పంచి తలారి వెంకట్రావు అధ్యక్షత వహించగా వైసిపి గ్రామ అధ్యక్షుడు తలారి కోటయ్య కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు దుంపా చెంచిరెడ్డి, జడ్పిటిసి దుంపా రమణమ్మ, చీమకుర్తి జడ్పిటిసి వేమా శ్రీనివాసరావు, ఎంపీపీ బి విజయ, ఎండిఓ ఎం శ్రీహరి, పిఆర్ ఏఈ పి రవిబాబు, సచివాలయ స్థలదాత, మాజీ సర్పంచ్ బివై ప్రసాద్, మాజీ సర్పంచ్ బి వెంకటసుబ్బయ్య, సొసైటీ ఛైర్‌పర్సన్లు బి శివరామయ్య, డి యలమందారెడ్డి, సంతనూతపాడు సర్పంచి డి నాగమణి, వీఆర్వో మరియకుమార్ గ్రామ కార్యదర్శి ఎం ప్రియాంక, ఎంపీటీసీ ఎల్ నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ వి నారాయణమ్మ, వైస్ ఎంపీపీ టి రాగమ్మ తదితరులు పాల్గొన్నారు.



గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి నాగార్జున

రైతును ఏమార్చి.. రూ.లక్ష అపహరణ

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

రైతును ఏమార్చిన గుర్తు తెలియని ఆగంతకుడు టీవీఎస్ వాహనంలో పెట్టిన రూ.లక్ష నగదును చోరీ చేసిన ఘటన మార్టూరు సమీపంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సమీపంలో చోటుచేసుకుంది. బాధితుడు, పోలీసుల కథనం ప్రకారం.. జొన్నతాళి గ్రామానికి చెందిన రైతు ఇండేల శ్రీనివాసరెడ్డి వ్యవసాయ పనులకు నగదు అవసరపడటంతో తన గ్రామానికే చెందిన కొండపల్లి ఏడుకొండలును రూ.లక్ష నగదు అప్పుగా ఇమ్మని కోరాడు. దీంతో శనివారం మార్టూరు యూనియన్ బ్యాంకు నుంచి నగదు డ్రా చేసిన ఏడుకొండలు బ్యాంకు సమీపంలోని ఓ కిరాణా దుకాణం వద్ద శ్రీనివాసరెడ్డికి లక్ష నగదును ఇచ్చాడు. ఆ నగదు మొత్తాన్ని తన టీవీఎస్ వాహనంలోని పెట్రోల్ ట్యాంక్ కవర్‌లో పెట్టుకున్న శ్రీనివాసరెడ్డి తిరిగి తన గ్రామానికి వెళుతున్నాడు. ఈ క్రమంలో మార్టూరు నుంచి శ్రీనివాసరెడ్డిని వెంబడిస్తున్న గుర్తు తెలియని వ్యక్తి జొన్నతాళి సమీపంలో శ్రీనివాసరెడ్డి టీవీఎస్‌ను ఆపి రోడ్డుపై మీ డబ్బులు పడిపోయాయని చెప్పడంతో బండి అపి ఆ డబ్బులు తన జేబులో ఉన్న రూ.20 నోట్లుగా భావించిన శ్రీనివాసరెడ్డి వాటిని తీసుకునే క్రమంలో ఉండగా బండి కవర్‌లో ఉంచిన రూ.లక్ష నగదును గుర్తు తెలియని ఆగంతకుడు తీసుకొని ఒక్క ఉదుటున అక్కడి నుంచి చిలకలూరిపేట వైపు తన బైక్‌పై ఉడాయించాడు. దీంతో ఆందోళనకు గురైన శ్రీనివాసరెడ్డి వెంటనే మార్టూరు అర్బన్ సీఐ ఎస్వీ రాజశేఖరరెడ్డికి ఫిర్యాదు చేసాడు. వ్యవసాయ పనుల నిమిత్తం అప్పు చేసి తీసుకున్న నగదు చోరీకి గురవ్వడంతో పోలీసులు స్పందించి తనకు న్యాయం చేయాలని శ్రీనివాసరెడ్డి కోరారు.

యువకుడు మృతి

ప్రజాశక్తి-పంగులూరు

అతిగా మద్యం సేవించి గొంతు ఎండిపోయి ఒక యువకుడు ప్రాణాలు పోగొట్టుకున్న సంఘటన మండల కేంద్రమైన పంగులూరులో జరిగింది. మండలంలోని జనకవరం గ్రామానికి చెందిన నూతలపాటి సుబ్బారావు(26) చిన్న వయసు నుంచే మద్యానికి బానిస అయ్యాడు. చిన్నతనంలోనే తండ్రి చనిపోవడంతో తల్లి మాటలు లెక్కచేయకుండా నిత్యం మద్యం తాగుతూ మత్తులో ఉండేవాడు. ఇదే క్రమంలో శుక్రవారం కూడా అతిగా మద్యం సేవించి పంగులూరులోని శివాలయానికి పడమర వైపున ఉన్న పొలాల్లో పడుకున్నాడు. శనివారం ఉదయం పొలం పనులకు వచ్చిన వాళ్లు సుబ్బారావు మరణించి ఉండటం చూసి పంచాయతీ అధికారులకు తెలియజేశారు. వీఆర్వో చింపారావు, మహిళా కానిస్టేబుల్ సంధ్యారాణి మృతుడి వివరాలు తెలుసుకొని బంధువులకు మృతదేహాన్ని అప్పగించారు. సుబ్బారావు మృతిపై ఎలాంటి అనుమానాలు లేవని, పోలీసు విచారణ వద్ద తల్లి సీత తెలియజేసింది.



అవగాహన కల్పిస్తున్న తహశీల్దారు విజయభాస్కర్

బిఎల్వోలకు ఈవీఎం మిషన్‌లపై శిక్షణ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం: యర్రగొండపాలెం నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల బిఎల్వోలకు శనివారం ఈవీఎం మిషన్‌లపై యర్రగొండపాలెంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆడిటోరియంలో శిక్షణ నిర్వహించారు. యర్రగొండపాలెం తహశీల్దారు ఉప్పల పాటి విజయభాస్కర్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల నేపథ్యంలో బిఎల్వోలంతా ఈవీఎం మిషన్‌లపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. మిషన్‌లను ఎలా ఉపయోగించాలి తదితర అంశాలను వివరించారు. తగిన జాగ్రత్తలు తీసుకొని ఈవీఎం మిషన్‌లపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. యర్రగొండ పాలెం, పుల్లలచెరువు ఎంఈవోలు ఆంజనేయులు, సామ్యూల్ జాన్, రీ సర్వే డిప్యూటీ తహశీల్దారు రామకృష్ణ, ఎలక్షన్ డిటి శ్రీనివాస్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఐదు మండలాల రెవెన్యూ, విద్య, వైద్య తదితర శాఖల సిబ్బందితో పాటు బిఎల్వోలు పాల్గొన్నారు.

20 నుండి వీఆర్ఏల సమ్మె



సమ్మె నోటీసు అందజేస్తున్న వీఆర్ఏలు

ప్రజాశక్తి - నగరం

రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 20నుండి వీఆర్ఏల సమ్మెను తెలియజేస్తూ డిప్యూటీ తాహశీల్దారు ఎం.శ్రీనివాసరావుకు విఆర్ఏల సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. సిఐటియూ జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణి లాల్ మాట్లాడుతు విఆర్ఏలకు పే స్కేల్, 2018 నుండి రికవరీ చేసిన డిఎ బకాయిలను తిరిగి చెల్లించాలని కోరారు. నామినీలను వీఆర్ఏలుగా గుర్తించాలని కోరారు. అర్హులైన వారికి పదోన్నతులు ఇవ్వాలని అన్నారు. ఈనెల 20లోపు పరిష్కరించకపోతే సమ్మెలోకి వెళతామని అన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య గ్రామాల్లో వారధులుగా పనిచేస్తూ, శిస్తు వసూలు ద్వారా ప్రభుత్వానికి రూ.కోట్ల ఆదాయాన్ని సమకూరుస్తున్న విఆర్ఏలు గత ఆరేళ్లుగా జీతాలు పెరగక కుటుంబాలు అవస్థలు పడుతున్నాయని అన్నారు. వీఆర్ఏలకు దశాబ్దాల తరబడి అమలైన డిపిఏను నిలిపివేయటమే కాక గతంలో చెల్లించిన డిఎను రికవరీ చేసి మరింతగా వీఆర్ఏల కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. తక్షణమే స్పందించి వీఆర్ఏల కుటుంబాలను ఆర్థిక ఇబ్బందుల నుండి కాపాడాలని కోరారు. తమతో కలిసి పనిచేసిన తెలంగాణా విఆర్ఏలకు అక్కడి ప్రభుత్వం పేస్కేల్ అమలు చేస్తున్నదని అన్నారు. మన రాష్ట్రంలో కూడా పేస్కేల్ అమలు చేయాలని కోరారు. సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గత ఎన్నికలకు ముందు విజయవాడ ధర్నాచౌక్లో జరిగిన విఆర్ఏల ధర్నా శిభిరంకు హాజరై తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే విఆర్ఏల జీతం రూ.15వేలకు పెంచుతామని ప్రకటించారని గుర్తు చేశారు. గత 6నెలల క్రితం రూ.500లు డిఎ అమలు చేస్తామన్న హామీ మేరకు జిఓ ఎంఎస్ నెం.40 ఇచ్చారని, కాని 2018 నుండి రూ.300ల డిఎని విఆర్ఏల జీతాల నుండి సుమారు రూ.15వేలు ప్రభుత్వం రికవరీ చేసిందని అన్నారు. రికవరీ చేసిన నిధిని తిరిగి విఆర్ఏలకు చెల్లిస్తామన్న హామీని నెరవేర్చలేదని అన్నారు. అర్హులైన విఆర్ఏలకు ప్రమోషన్స్ అమలు చెయ్యడం లేదని అన్నారు. నామీనలను విఆర్ఏలుగా గుర్తిస్తామన్న హామి అమలు చేయాలని కోరారు. విఆర్ఏ సంఘం అధ్యక్షులు జి పిటర్, ఉపాధ్యక్షులు యు దయరత్నం, ఎం అనంద్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



డిటీకి వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు

ప్రజాశక్తి - బాపట్ల

ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎపీ జెఎసి ఆధ్వర్యంలో తహశీల్దారు కార్యాలయం వద్ద శనివారం ధర్నా చేశారు. ఎన్‌జిఓ అధ్యక్షులు పి నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో 15లక్షల మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, ఫుల్ టైం, దినసరి కార్మికులు వివిధ శాఖల్లో పనిచేస్తున్నారని అన్నారు. ప్రతి ఉద్యోగికి ఆర్థిక, ఆర్థికేతర సమస్యలు ఉన్నాయని అన్నారు. 12వ పిఆర్సి కమిషన్ వేసినప్పటికీ ప్రగతికి నోచుకోలేదని అన్నారు. రాష్ట్రస్థాయి ఉద్యోగ సంఘాలతో చర్చించి ఉద్యోగుల నుండి సమాచారాన్ని సేకరించి అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదికను సమర్పించేందుకు గడువు కావాలని అన్నారు. 2023 జూలై 1నుండి పిఆర్సి అమలు కావలసి ఉందని అన్నారు. ధరలు పెరిగి ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఉద్యోగులకు తక్షణమే రూ.25వేల కోట్లు బకాయిలు చెల్లించాలని కోరారు. సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహశీల్దారు కార్యాలయ డిటి శ్రీదేవికి అందజేశారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వినయ్ కుమార్, ఎపిటిఎఫ్ కార్యదర్శి జి ఇసాక్, చాంద్ భాషా, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు బడుగు శ్రీనివాసరావు, ఎస్‌టి యు జిల్లా అధ్యక్షులు అమర్నాథ్, ఎస్‌టియు అధ్యక్షులు సిహెచ్ సుబ్బారావు, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రామ్మోహనరావు, ఎన్ఎంయు జిల్లా అధ్యక్షులు పాల్గొన్నారు.

పర్చూరు : ఉద్యోగుల పిఆర్‌సి, సిపిఎస్ సమస్యలు తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. ధర్నా అనంతరం డిప్యూటీ తహశీల్దారు ఎల్ నాగలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌జిఓ అసోసియేషన్ తాలూక అధ్యక్షులు ఎం సత్యనారాయణ, యుటిఎఫ్ కార్యదర్శి సుబ్బయ్య, ఆర్ఐ ప్రేమ్ కుమార్, కె కుమారి, డిజిటల్ అసిస్టెంట్ ఎంఎం రఫీ, ఎఎస్ఓ శ్రీమన్నారాయణ, సర్వేయర్ సురేష్, యు సుబ్బారావు, ప్రకాష్, ఆర్‌డబ్ల్యుఎఫ్ సిబ్బంది, విఆర్ఓలు, సర్వేయర్లు, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.



పర్చూరులో వినతి పత్రం అందజేస్తున్న ఉద్యోగులు

ఎస్ఎఫ్ఐ ప్రజ్ఞ వికాసం మోడల్ పరీక్ష



బాపట్లలో మోడల్ పరీక్ష నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - బాపట్ల

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు ప్రజ్ఞ వికాసం మోడల్ పరీక్ష నిర్వహించినట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆర్య తెలిపారు. మార్చి 18 నుండి రాష్ట్ర ప్రభుత్వం పబ్లిక్ పరీక్షలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ప్రముఖ విద్యావేత్త, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు పర్యవేక్షణలో సబ్జెక్టులో నిష్ణాతులైన ఉపాధ్యాయ బృందం వంద మార్కుల మోడల్ ప్రశ్న పత్రాన్ని తయారు చేశారని అన్నారు. విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో అధిక మార్కులు సాధించేందుకు ఈ మోడల్ పరీక్ష ఎంతగానో దోహద పడుతుందని అన్నారు. ఎస్ఎఫ్ఐ విద్యార్థి సమస్యలపై పోరాటాలు చేయడమే గాక చదువుల్లో ప్రోత్సహించేందుకు, అనేక మోడల్ పరీక్షలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తుం దని అన్నారు. విద్యార్థుల్లో పరీక్షల భయం, ఆందోళన పోగొట్టి, పరీక్షల్లో అధిక మార్కులు సాధించే విధంగా రూపొందించిన పరీక్ష విద్యార్థులకు ఎంతగానో ఉపయోగ కరమని అన్నారు. పట్టణంలో వెయ్యి మందికి పైగా విద్యా ర్థులు పరీక్షకు హాజరయ్యారని అన్నారు. పరీక్ష అనంతరం పాఠశాల స్థాయిలో ప్రధమ, ద్వితీయ బహుమతులతో పాటు ప్రశంస పత్రాన్ని అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కళ్యాణ్ చక్రవర్తి, వెంకటేష్ పాల్గొన్నారు.

భట్టిప్రోలు : ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్, జెవివి ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు ప్రజ్ఞా వికాసం మోడల్ టెస్ట్ శనివారం నిర్వహించారు. స్థానిక విశ్వశాంతి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్, టీఎం రావు ఉన్నత పాఠశాల్లో పరీక్షలు జరిగాయి. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పి మనోజ్ మాట్లాడుతూ 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు ఎలాంటి భయాందోళనకు గురి కాకుండా ఉండేందుకుగాను ఈ పరీక్ష నిర్వహిస్తున ్నట్లు చెప్పారు. విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వెలికి తీసి, సామర్థ్యాన్ని పరీక్షించుకునేందుకు ఇలాంటి పరీక్షలు దోహద పడతాయని అన్నారు. ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్‌కు జన విజ్ఞాన వేదిక సంయుక్తంగా నిర్వహించిన పరీక్షలో విద్యార్థుల సామర్థ్యాన్ని బట్టి వచ్చిన మార్కుల కనుగుణంగా విద్యార్థులను ప్రకటించి ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నట్లు తెలిపారు. సహకరించిన పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. తొలిసారిగా పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఇలాంటి పరీక్షలు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో విశ్వశాంతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ ఎంపీ వెంకట్రావు, టిఎం రావు ఉన్నత పాఠశాల హెచ్ఎం సి రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.



భట్టిప్రోలులో ఎస్ఎఫ్ఐ మోడల్ టెస్ట్ రాస్తున్న విద్యార్థులు



మాట్లాడుతున్న సిఐ శ్రీనివాసులు

ఎన్నికలు ప్రశాంతంగా జరుపుకోవాలి

ప్రజాశక్తి - బాపట్ల

అంజుమాన్ ఏ ఇస్లామియా ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా కమిటీ సభ్యులు కృషి చేయాలని పట్టణ సీఐ శ్రీనివాసులు సూచించారు. అంజుమన్ కమిటీ ఎన్నికలు ఆదివారం జరగనున్నాయి. ఈ సందర్భంగా అంజుమన్ కమిటీ సభ్యులతో ఆయన శనివారం మాట్లాడారు. ఈనెల 18న మార్కెట్ షాది ఖానాలో జరిగే అంజుమాన్ ఏ ఇస్లామియా ఎన్నికల్లో 29మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఉదయం పోలింగ్, సాయంత్రం కౌంటింగ్ నేపథ్యంలో ముస్లిం సోదరులు వివాదాలకు పాల్పడకుండా ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలన్నారు. చిన్నపాటి వివాదం జరిగిన సహించేది లేదని హెచ్చరించారు. కేసులు నమోదు చేసి అరెస్టు చేస్తామని చెప్పారు. ఎననికల నిర్వహణకు తాము సహకరిస్తామని అన్నారు.

చంద్రబాబుకు కొండయ్య సత్కారం

ప్రజాశక్తి - చీరాల

టిడిపి అధినేత చంద్రబాబును టిడిపి చీరాల ఇన్చార్జి కొండయ్య సత్కరించారు. ఇంకొల్లులో కదిలి రా సభకు హాజరైన చంద్రబాబును హెలి పాడ్ వద్ద పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సత్కరించారు. చీరాల నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుండి వాహనాల్లో పార్టీ కార్యకర్తలను కొండయ్య తనయుడు అమర్‌నాద్ ఇంకొల్లు సభకు తరలించారు.



సమావేశంలో హై కోర్టు జడ్జి జి రామకృష్ణ ప్రసాద్

ఉన్నత విద్యతోనే దేశాభివృద్ధి

ప్రజాశక్తి - రేపల్లె

విద్యార్థులకు సమాజంలో పేరుకుపోయిన రుగ్మతలు, అపోహలపై అవగాహన కల్పించి, మెరుగైన సమాజాన్ని తీర్చిదిద్దే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఏపీ హైకోర్టు జడ్జి జి రామకృష్ణ ప్రసాద్ అన్నారు. మండలంలోని చాట్రగడ్డ సరస్వతి విద్యా మందిర్ పాఠశాలను ఆయన శనివారం సందర్శించారు. పిల్లల మానసిక స్థితి గురించి సిబ్బంది ద్వారా వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులను ప్రశ్నలు అడిగి వారి జిజ్ఞాసను తెలుసుకుని ఉత్తేజ పర్చారు. ప్రభుత్వం, ఇతర సంస్థలు ఇచ్చే సదుపాయలును సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. పాఠశాల్లో వసతులు, అగ్నిమాపక పరికరాలు, రికార్డులను పరిశీలించారు. దేశం అభివృద్ధి చెందాలంటే విద్యతోనే సాధ్యమవుతుందని అన్నారు. దేశానికి సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంకేతిక పురోగతిని తీసుకురావడానికి ఉన్నత విద్య మాత్రమే సాధనమని అన్నారు. కార్యక్రమంలో స్థానిక న్యాయమూర్తులు వెంకటేశ్వర్లు, జగదీష్ బాబు, రూపశ్రీ, బార్ అసోసియేషన్ అధ్యక్షులు గోపాలరావు, డిఎస్పి మురళీకృష్ణ, సిఐ నజీర్ బేగ్, కొత్తపల్లి రమేష్, కృష్ణ చంద్ర, సెక్రటరీ రామరాయ చౌదరి, జాయింట్ సెక్రటరీ దుగ్గిరాల అశోక్ కుమార్, సరస్వతి విద్యాపీఠం స్టేట్ సెక్రటరీ కొనతం జగదీష్, హెచ్ఎం కొల్లా దశపతిరావు, పాఠశాల కమిటీ సభ్యులు తొట్టెంపూడి సుభాష్ పాల్గొన్నారు.



ఎంపి సురేష్‌తో యడం బాలాజీ

ఎంపీ సురేష్‌ను కలిసిన బాలాజీ

ప్రజాశక్తి - పర్చూరు

వైసిపి నూతన ఇన్చార్జిగా బాధ్యతలు స్వీకరించిన యడం బాలాజీ బాపట్ల ఎంపి నందిగం సురేష్, మాజీ ఇంచార్జి రావి రామనాథం బాబు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు బత్తుల బ్రహ్మారెడ్డిని మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు. ఆయన వెంట పర్చూరు మాజీ ఎంపీపీ, వైసీపీ నాయకులు కొల్లా వెంకటరావు, సర్పంచుల సంఘం అధ్యక్షులు, దగ్గుబాడు సర్పంచి రవీంద్రనాథ్ ఠాగూర్, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు, ఇనగల్లు సర్పంచ్ నరిశెట్టి వితిన్‌బాబు, వై హరిప్రసాద్ ఉన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి ఎస్‌కె రెహన

ఉన్నత లక్ష్యంతో చదవాలి

ప్రజాశక్తి - చీరాల

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదువుకొని జీవితంలో అభివృద్ధి చెందాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్‌కె రెహన అన్నారు. న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక చైతన్య భారతి డిగ్రీ కళాశాల నందు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సదస్సులో ఆమె మాట్లాడారు. విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని జీవితంలో ఉన్నత శిఖరానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఫోక్సో యాక్ట్, ర్యాగింగ్ యాక్ట్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాల్య వివాహాల నిరోధక చట్టం, ఉచిత న్యాయ సహాయం, సైబర్ క్రైమ్ తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎన్ సోమేశ్వరరావు, అడ్వకేట్లు వినీల, జికె ఈశ్వరి, తన్నీరు సురేష్, పిఎల్‌వి ఎస్‌డి మతీన్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

సబ్ కలెక్టర్ కార్యాలయం జెఎసి ఆధ్వర్యంలో ఎదుట ధర్నా

ప్రజాశక్తి-మార్కాపురం: ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఉద్యోగ సంఘాల జెఎసి ఆధ్వర్యంలో శనివారం ధర్నా జరిగింది. పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్‌లకు సంబంధించిన నగదు విడుదల చేయాలని కోరారు. జిపిఎఫ్ రుణాలు ఇవ్వాలన్నారు. సుమారు 68 శాతం బేసిక్ పే మీద డిఏ బకాయిలు రావాల్సి ఉందన్నారు. 2022 పే బకాయిలు, సిపిఎస్ ఉద్యోగులను రెగ్యులర్ పెన్షన్ స్కీం కింద తీసుకొని రావడం అతి ముఖ్యమైన డిమాండ్ అని చెప్పారు. ఫిట్మెంట్ 12వ నూతన పిఆర్‌సి ప్రకారం అనౌన్స్ చేయాలని, వీటన్నిటికీ నగదు ఇచ్చేలా జీవోలు విడుదల చేయాలని కోరారు. మార్కాపురం తాలూకా కేంద్రం యూనిట్‌గా అన్ని శాఖల ఉద్యోగుల ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో జెఎసి చైర్మన్ బివి శ్రీనివాస్ శాస్త్రి, కార్యదర్శి వడ్డమాని శ్రీనివాస్, ఉపాధ్యక్షులు రామచంద్రారెడ్డి, యక్కంటి రమేష్‌రెడ్డి, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఒద్దుల వీరారెడ్డి, పండిత పరిషత్ రాష్ట్ర కార్యదర్శి ఎం రవిచంద్ర, కోశాధికారి రవికిరణ్, బాల విజయకుమారి, కాశి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శుల సంఘం సహాయ కార్యదర్శి (మహిళా విభాగం) విజయలక్ష్మి, లక్ష్మి, మునీశ్వరమ్మ, అటవీశాఖ నుంచి రవిచంద్ర, ఖాదర్‌బాషా, భగత్, పలు శాఖల నుంచి అంజయ్య, పద్మనాభరెడ్డి, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

దర్శి: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని, రావాల్సిన పెండింగ్ బకాయిలు చెల్లించాలని ఉద్యోగుల జెఎసి జిల్లా కార్యదర్శి జేవీజీ కీర్తి అన్నారు. శనివారం ఎమ్మార్వో కార్యాలయం వద్ద సమస్యలపై ఉపాధ్యాయులు, ఉద్యోగులు నిరసన తెలిపారు. 12వ పీఆర్సీ 30శాతం ఇవ్వాలని, సీపీఎస్ రద్దు చేసి పాత విధానాలను కొనసాగించాలని అర్జీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసరావు, బాబు, నాయుడు, నాగముని, జివి సుబ్బయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



మార్కాపురంలో మాట్లాడుతున్న జెఎసి నేత బివిఎస్ శాస్త్రి

కనిగిరి: కనిగిరి తాలూకా ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షులు పిల్లి రమణారెడ్డి అధ్యక్షతన ఉద్యోగులు, పెన్షనర్లు శనివారం జేఏసీ పిలుపు మేరకు కనిగిరి ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీవో కార్యాలయంలో అందజేశారు. పెండింగ్ బిల్లులు, డిఎ బకాయిలు వెంటనే చెల్లించాలని, ఓపిఎస్ అమలు చేయాలని, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు మీగడ వెంకటేశ్వర్లురెడ్డి, టీ పెద్దిరెడ్డి, యుటిఎఫ్ నాయకులు ఎస్కే కాజా రహమతుల్లా, ఎస్‌టియు నాయకులు తుమ్మ వెంకటేశ్వర్లు, నరసింహారెడ్డి, ఏపీటీఎఫ్ నాయకులు ఎస్కే నాయబ్ రసూల్, మాల కొండయ్య, పంచాయతీరాజ్ నాయకులు రహమత్ బాషా, ఖాదర్‌బాషా, హజరత్‌అలీ, వ్యవసాయ శాఖ వెంకటస్వామి, వెంకట సుబ్బయ్య, వైద్య శాఖ రషీద్, నరసింహారావు, ఐసిడిఎస్ ఉద్యోగుల సంఘం నాయకురాలు ప్రశాంతి, సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు సుబ్బారెడ్డి, నాగమల్లేశ్వరరెడ్డి, అంకమరాజు, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ రాహుల్ మీనా

యాత్రికులకు సౌకర్యాలు కల్పించాలి: సబ్ కలెక్టర్

ప్రజాశక్తి-పెద్దదోర్నాల: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీశైలం వెళ్లి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా తెలిపారు. శనివారం పెద్దదోర్నాలలోని బొగ్గరపు వారి కళ్యాణ మండపంలో వివిధ శాఖల అధికారులతో శివరాత్రి పండుగ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగకు శ్రీశైలం వెళ్లి వచ్చే భక్తుల రద్దీ అధికంగా ఉంటుందని అన్నారు. అయితే భక్తులకు మరుగుదొడ్లు, మంచినీరు, పారిశుధ్యం, విద్యుత్ తదితర సౌకర్యాలను కల్పించాలన్నారు. పారిశుధ్యం లోపిస్తే వ్యాధులు ప్రబలుతాయని అన్నారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిత్తూరి హారిక, తహశీల్దారు హమీద్, ఎంపిడివో నాసర్‌రెడ్డి, సిఐ రాములు నాయక్, బ్రేక్ ఇన్‌స్పెక్టర్ మాధవరావు, ఐటిడిఏ డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ఎం శ్రీనివాసరావు, ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ భాస్కర్ కుమార్, ఎఫ్ఆర్వో విశ్వేశ్వరరావు, విద్యుత్ ఏఈ నాగేంద్రరెడ్డి, పంచాయతీ కార్యదర్శి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఐసిడిఎస్ డైరెక్టర్‌గా మేడికొండ జయంతి

ప్రజాశక్తి-ముండ్లమూరు



ఐసిడిఎస్ డైరెక్టర్‌గా ముండ్లమూరు మండలం శంకరాపురం గ్రామానికి చెందిన మేడికొండ జయంతిని ఎంపిక చేసినట్లు ఐసిడిఎస్ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ మేరకు ఉత్తర్వులు తనకు అందాయని జయంతి తెలిపారు. ఈ పదవికి తనను ఎంపిక చేసిన ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులరెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షులు జంకె వెంకటరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఆమె ఇప్పటి వరకు సచివాలయ జెఎసి కన్వీనర్‌గా పనిచేస్తున్నారు.



సబ్ కలెక్టర్‌ను సన్మానిస్తున్న సర్పంచ్ దంపతులు

సబ్ కలెక్టర్‌కు ఘన సన్మానం

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా శనివారం పెద్దదోర్నాలకు తొలిసారిగా వచ్చిన సందర్భంగా బొగ్గరపు వారి కళ్యాణ మండపంలో సర్పంచ్ చిత్తూరి హారిక, ఆమె భర్త కరుణాకర్‌లు శాలువలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ విజయదుందుభి మోగిస్తుంది: బూచేపల్లి

ప్రజాశక్తి-దర్శి: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో వైసిపి అత్యధిక స్థానాలు గెలుచుకుని విజయదుందుభి మోగిస్తుందని దర్శి మాజీ ఎమ్మెల్యే, వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. దర్శి పట్టణంలోని 18వ వార్డులో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మతో కలిసి ఇంటింటికీ తిరిగి ప్రజా సమస్యలు తెలుసుకుని ఓట్లు అర్థించి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా సంక్షేమానికి, అభివృద్ధికి పెద్దపీట వేశారని, ప్రతి ఒక్కరూ అన్ని పథకాలకు లబ్ధిపొందారని, వచ్చే ఎన్నికల్లో వైసిపిని ప్రజలందరూ గెలిపిస్తారని అన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరిస్తానని తెలిపారు. తొలుత వినాయకుని గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వెన్నపూస వెంకటరెడ్డి, పట్టణ అధ్యక్షులు కట్టెకోట హరీష్, పట్టణ జేసీఎస్ కన్వీనర్ కోటిరెడ్డి, కార్పొరేషన్ డైరెక్టర్లు, ఎస్ఎం బాషా, కుమ్మిత అంజిరెడ్డి, వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, మాజీ ఎంపీపీలు ఇత్తడి దేవదానం, పోశం మధుసూదన్‌రెడ్డి, నాయకులు కర్నా భాస్కర్, యాతం రమణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, వెంకటరెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

జగన్ సిఎం కావడమే లక్ష్యం: అన్నా

ప్రజాశక్తి-మార్కాపురం



తర్లుపాడులో పర్యటించిన అన్నా రాంబాబు

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సిఎం కావడమే తమ లక్ష్యమని గిద్దలూరు ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ సమన్వయకర్త అన్నా వెంకటరాంబాబు అన్నారు. మండల కేంద్రమైన తర్లుపాడులో ఆయన శనివారం పర్యటించారు. వైసిపి ముఖ్య కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నా మాట్లాడుతూ సిఎం జగన్ ఆదేశాలతో మార్కాపురం నుంచి పోటీలో నిలుస్తున్నట్లు చెప్పారు. నిస్వార్థంగా సేవలు అందిస్తానని, వచ్చే ఎన్నికల్లో మార్కాపురం నుంచి ఎమ్మెల్యేగా గెలిపించేందుకు కష్టపడాలని కోరారు. ఆయన వెంట తర్లుపాడు ఎంపిపి సూరెడ్డి భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, వైసిపి మండల కన్వీనర్ మురారి వెంకటేశ్వర్లుతో పాటు వైసిపికి చెందిన ఎంపిటిసిలు, సర్పంచులు, నామినేటెడ్ పదవుల్లో ఉన్న వారితో పాటు వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎస్‌పికి పుష్పగుచ్ఛమిస్తున్న జడ్‌పి చైర్‌పర్సన్ బూచేపల్లి

ఎస్పీని కలిసిన బూచేపల్లి

ప్రజాశక్తి-దర్శి

ప్రకాశం జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డిని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే, దర్శి నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి శనివారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఇక నుంచి నేను గిద్దలూరుకు స్థానికుడిని

ప్రజాశక్తి-గిద్దలూరు

వైసిపి గిద్దలూరు ఇన్‌ఛార్జి నాగార్జునరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

నేటి (ఫిబ్రవరి 17) నుంచి తాను గిద్దలూరుకు స్థానికుడినని నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త, మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నేటి నుంచి తాను ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిత్యం నియోజకవర్గ ప్రజలతోనే ఉంటానని అన్నారు. తాను మార్కాపురంలో కూడా అక్కడే స్థానికులకు అందుబాటులో ఉండి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టానని అన్నారు. గిద్దలూరు నియోజకవర్గ అభివృద్ధికి కూడా సీఎం జగన్ మోహన్‌రెడ్డి చొరవతో మరిన్ని నిధులు తెస్తానని, నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తానని అన్నారు.

రాజకీయ ఆరోపణలు సహజం

రాజకీయ నాయకుడిపై రాజకీయ ఆరోపణలు సహజమని, అలాగే కొంతమంది తమపై బురద చల్లడానికి ప్రయత్నిస్తున్నారని అన్నారు. నిజాయితీకి మారుపేరు కుందురు కుటుంబమని, తన తండ్రి మూడుసార్లు సమితి ప్రెసిడెంట్‌గా పనిచేశారని, నాలుగు పర్యాయాలు శాసన సభ్యునిగా ఎన్నికయ్యారని తెలిపారు. తన మామ ఉడుముల శ్రీనివాసరెడ్డి కూడా శాసనసభ్యునిగా ఎన్నికయ్యారని, తనని 2019 ఎన్నికలలో శాసన సభ్యునిగా ప్రజలు ఎన్నుకున్నారని అన్నారు. తాము తప్పు చేసే వ్యక్తులమైతే ప్రజలు పలుమార్లు మా కుటుంబ సభ్యులని ఎందుకు ఎమ్మెల్యేలుగా ఎన్నుకుంటారని అన్నారు. మేము తప్పు చేశామని ఆరోపించే వ్యక్తులు ఆరోపణలు మాని చట్ట ప్రకారం తప్పులను నిరూపించాలని సవాలు చేశారు. వారి వద్ద ఎటువంటి ఆధారాలు లేకుండా కేవలం రాజకీయ కక్షతో బురద చల్లుతున్నారని అన్నారు.

కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా 'రెహనాబాను'

ప్రజాశక్తి-మార్కాపురం



కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా షేక్ రెహనాబాను నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ అధిష్ఠానం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా రెహనాబాను మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. తనకే బాధ్యతలు అప్పగించిన పార్టీ పెద్దలకు, సహకరించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ సైదాకు కృతజ్ఞతలు తెలిపారు.

టిడిపి-జనసేన అధికారంలోకి వస్తాయి: గరికపాటి

ప్రజాశక్తి-దర్శి



భవిష్యత్తు గ్యారంటీ పథకాలను వివరిస్తున్న గరికపాటి

వచ్చే ఎన్నికల్లో జనసేన, టీడీపీ ఆధ్వర్యంలో పార్టీ అధికారంలోకి వస్తుందని స్థానిక జనసేన నియోజకవర్గ నాయకులు గరికపాటి వెంకట్ అన్నారు. దర్శిలోని కురిచేడు రోడ్డులో జనసేన నాయకులు గరికపాటి ప్రజా స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చే ఎన్నికల్లో గ్యారంటీ భవిష్యత్తు గురించి వివరించారు. అక్కడక్కడా షాపుల వద్ద ప్రజల స్పందన గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అదే విధంగా తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఇంకొల్లులో జరిగిన రా కదిలిరా సభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు నాయకులను గరికపాటి కలిశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పాల్గొన్నారు.



గోన కుటుంబంతో ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి

'గోన' కుటుంబాన్ని కలిసిన 'కుందురు'

ప్రజాశక్తి-గిద్దలూరు: సెయింట్ పాల్స్ విద్యా సంస్థల అధినేత గోన ఆశీర్వాదంను, ఆయన కుమారుడు గోన రంజిత్ కుమార్‌ను వారి స్వగృహంలో నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త, మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి శనివారం కలిశారు. ఈ సందర్భంగా వారు పలు రాజకీయ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కుందురు నాగార్జునరెడ్డి వారితో మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలో సమిష్టిగా కలిసి వైసిపి విజయానికి కృషి చేసి జగన్మోహన్‌రెడ్డిని మరల ముఖ్యమంత్రిగా చేద్దామని అన్నారు. కార్యక్రమంలో భూమా బాల నరసింహారెడ్డి, మాజీ ఎంపీపీ కడప వంశీధర్‌రెడ్డి, సారె వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.



ప్రచారంలో టిడిపి నాయకులు అనగాని శివప్రసాద్

కరపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి - రేపల్లె

మండలంలోని మోళ్ళగుంట గ్రామంలో బాబు షఉరిటీ, భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ ఆదేశాల మేరకు టిడిపి నాయకులు శనివారం నిర్వహించారు. చంద్రబాబు రూపొందించిన మినీ మేని ఫెస్టో కరపత్రాలను ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించారు. టిడిపి నాయకులు అనగాని శివప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వాన్ని ప్రజలు సాగనంపే రోజులు దగ్గర పడ్డాయని అన్నారు. రాష్ట్రంలో పరిపాలన సక్రమార్గంలో ఉండాలంటే చంద్రబాబు సిఎం కావాలని అన్నారు. కార్యక్రంలో బీసీ సెల్ కార్యదర్శి వెంకటేశ్వరరావు, కర్రి శ్రీను, జనసేన అధ్యక్షులు రేపల్లె జానకి రామయ్య, వడ్డీ లక్ష్మోజీ, శేరు నాగూర్, లంకే వెంకటేశ్వరరావు, లంకే రాజు, కొక్కిలగడ్డ రామారావు, పంతాని సాయికుమార్, కొలసాని రాము, రేపల్లె సురేష్, కమతం శివ పాల్గొన్నారు.

భక్తులకు సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి - రేపల్లె



తహశీల్దారు రవీంద్రబాబు

మండలంలోని అరవపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ బాల కోటేశ్వర స్వామి మహా శివరాత్రి తిరునాళ్ళ మార్చి 8, 9, 10తేదీల్లో జరుగుతాయని తహశీల్దారు చొప్ప రవీంద్ర బాబు అన్నారు. తన కార్యాలయంలో అధికారులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ తిరునాళ్ల సందర్భంగా వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్య లేకుండా దేవాలయాల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. మూడు రోజులపాటు గ్రామంలో మద్యం విక్రయాన్ని నిషేధిం చాలని, పారిశుద్ధ్యం మెరుగుపరచాలని అధికారులకు సూచించారు.



వినతి పత్రం అందిస్తున్న ఎన్‌జిఒ అసోసియేషన్ నాయకులు

ఎన్‌జిఒ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - అద్దంకి

ఎపి ఎన్‌జిఓ అసోసియేషన్, తాలూకా యూనిట్ ఆద్వర్యంలో స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద తాలూకాలోని ఉద్యోగులు అందరూ కలసి శనివారం ధర్నా నిర్వహించారు. డిఎ, పిఆర్సి బకాయిలు, జిపిఎఫ్, ఎపిజిఎల్ఐ, సరెండర్ లీవ్ అన్నిటిని వెంటనే ఉద్యోగులకు చెల్లించాలని, సిపిఎస్ రద్దుచేసి ఓపీఎస్ పునరుద్ధించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జెఎసీ చైర్మన్ జి కిరణ్ కుమార్, వైస్ చైర్మన్ టి రమేష్ బాబు, ఏడుకొండలు, అమరనాథ్, ఆర్టీసీ ఎన్ఎంయు సెక్రెటరీ వందనం బాబు, రవికుమార్, అర్జున్‌రావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.ం

నేడు ఉచిత మెగా వైద్యశిబిరం

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, వాసవి క్లబ్ ఆధ్వర్యంలో నేడు మార్టూరులో నిర్వహిస్తున్న ఉచిత మెగా వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రత్తిపాటి సురేష్, మోదడుగు మురళి బాలకృష్ణ కోరారు. స్థానిక మద్ది సత్యనారాయణ జెడ్‌పి హై స్కూల్ ఆవరణలో గుంటూరుకు చెందిన వేదాంత హాస్పిటల్స్ సౌజన్యంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కిడ్నీ వైద్యనిపుణులు డాక్టర్ చింతా రామకృష్ణ, గుండె వైద్యనిపుణులు డాక్టర్ తిరుమల నరేష్, షుగర్ వ్యాధి నిపుణులు డాక్టర్ మంజుల శ్రీరామ్, ఇంఫెర్టిలిటీ స్పెషలిస్ట్ డాక్టర్ స్వప్న, డాక్టర్ మురళీకృష్ణ గంగూరి వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. షుగర్, బిపి, ఈసీజీ, ఎముకల సాంద్రత పరీక్షలు ఉచితంగా చేస్తారని తెలిపారు.

'పారిశుధ్యం'పై సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి - సంతమాగులూరు



సమావేశంలో సెర్ప్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు

గ్రామాల్లో వ్యర్థాల ద్వారా ఎరువులు తయారు చేయాలని సెర్ప్ సంస్థ కో ఆర్డినేటర్ సిహెచ్ శ్రీనివాస రావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశం హాల్ నందు సెర్ప్, ఐటీసీ బంగారు భవిష్యత్తు ఆధ్వర్యంలో పారిశుద్ధ్య నిర్వహణపై పంచాయితీ సిబ్బందికి మండల స్థాయి శిక్షణ నిర్వహించారు. ప్రతి గ్రామంలో తడి, పొడి, ప్రమాదకర వ్యర్థాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. సక్రమంగా వ్యర్థాలు సేకరించడం ద్వారా గాలి, నీరు, భూమి కాలుష్య నివారణ చేయవచ్చని అన్నారు. దీనివల్ల ప్రజలు ఆరోగ్యం, ఆయుష్ పెరుగుతుందని అన్నారు. గ్రామాల్లో వ్యర్థాలు సేకరించకపోతే డెంగ్యూ, టైఫాయిడ్ సోకే ప్రమాదం ఉందన్నారు. వ్యర్థాలు తగలబెడితే కాలుష్యం పెరిగి మానవ జీవనానికి ప్రమాదంగా ఉందని అన్నారు. వ్యర్థాలను సేకరణ కేంద్రాల్లో తడి వ్యర్థాలను ఎరువుగా, పొడి వ్యర్థాలను రీసైకిలింగ్ చేయవలసిన అవసరం ఉందని అన్నారు. ఎస్డబ్లుపిసిలు నిర్వహణ, వ్యర్థాల సేకరణ, క్లాస్ మిత్రులు జీతాలు వినియోగం రుసుం మొదలగు విషయాలను పారిశుద్ధ్య సంఘానికి, సర్పంచులకు పూర్తిగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా ఐటిసి రిసోర్స్ పర్సన్ సిహెచ్ బొల్లయ్య, ఈఓపిఆర్డి శివరామ ప్రసాదరావు, ఎంపీడీఒ కాశయ్య, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

టిడిపి హయాంలో ఆటోనగర్ అభివృద్ధి

ప్రజాశక్తి- మార్కాపురం రూరల్



సమావేశంలో మాట్లాడుతున్న కందుల నారాయణరెడ్డి

టిడిపి హయాంలోనే ఆటోనగర్‌ను అభివద్ధి చేశామని మాజీ ఎంఎల్ఎ, టిడిపి ఇన్చార్జ్ కందుల నారాయణరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని తరిమడుగు సమీపంలోని ఆటోనగర్ నందు ఆటోనగర్ యూనియన్ సభ్యులు శనివారం ఆత్మీయ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఆటోనగర్ అభివద్ధికి కషి చేసానని అన్నారు. రాబోయేది టిడిపి ప్రభుత్వమేనని అన్నారు. టిడిపి అధినేత చంద్రబాబు మార్కాపురంనకు విచ్చేసినప్పుడు మార్కాపురం ప్రత్యేక జిల్లాగా ప్రకటిస్తారని వాగ్దానం చేశారని గుర్తు చేశారు. ఇటీవల తాను కలిసినప్పుడు కూడా మార్కాపురం జిల్లా అంశం ప్రస్తావించారని అన్నారు. ప్రత్యేక జిల్లా ఏర్పాటైతే మార్కాపురం అన్ని రకాలుగా అభివద్ధి జరుగుతుందని అన్నారు. బడ్డీ షాపుల నుండి బంగారం షాపు, ఆటోమొబైల్ రంగం అభివద్ధి చెందుతుందని అన్నారు.

ఎయిడెడ్ ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

ఎపి టీచర్స్ గిల్డ్ జిల్లా కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిఇఒను ఎపి టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె వెంకట్రావు, ప్రభాకరరెడ్డి కోరారు. పదవీ విరమణ పొందిన ఎయిడెడ్ ఉపాధ్యాయుల ఫైళ్లను త్వరగా ఎజి ఆఫీసుకు పంపాలన్నారు. జిల్లాలో కారుణ్య నియమకానికి అర్హులైన వారి జాబితాను డైరెక్టర్ కార్యాలయానికి పంపాలన్నారు. జీవో నెంబర్ 155ప్రకారం ఎంఇఒలకు పే పిక్సెషన్ బాధ్యత ఇవ్వాలన్నారు. ఎయిడెడ్ పాఠశాలల్లో పని చేసే తెలుగు, హిందీ, పిఈటిల జాబితా డైరెక్టర్‌కి పంపాలని, విద్యార్థులు లేని ఎయిడెడ్ పాఠశాలలో పని చేసే ఉపాధ్యాయుల విధి విధానాలను రూపొందించాలన్నారు. ప్రభుత్వం ఇంటర్నెట్ సౌకర్యం కల్పించి ఐఎఫ్ ప్యానెల్ బోర్డులు ఇవ్వాలన్నారు. ఎయిడెడ్ ఉపాధ్యాయులకు వాలంటరీ రిటైర్మెంట్ ఇవ్వమని ఇబ్బందులకు గురి చేసే యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలన్నారు. డిఇఒ సత్వరమే పరిష్కరించాలని కోరారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి

ప్రజాశక్తి - పొదిలి



పొదిలిలో టిడిపి ప్రచారంనిర్వహిస్తున్న కందుల విగ్నేష్ రెడ్డి

టిడిపితోనే రాష్ట్ర భవిష్యత్తు మెరుగుపడి అభివద్ధి సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కుమారుడు విగ్నేష్‌రెడ్డి అన్నారు. పట్నంలోని విశ్వనాధపురంలో బాబు షఉ్యరిటీ, భవిషత్ గ్యారంటీ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వైసిపి పానలో రాష్ట్రం 30ఏళ్లు వెనక్కి వెళ్లిందన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం నిత్యం తపనపడేమాజీ చంద్రబాబుతోనే సాధ్యమవుతుందన్నారు. చంద్రబాబును అక్రమ అరెస్టు చేసి వైసిపి పతనమైందని అన్నారు. ఈ సందర్భంగా మహిళలు హరతులు, పూలదండలు, శాలువాలతో ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో టిడిపిని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. టిడిపి సూపర్సిక్స్ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కాటూరి నారాయణ ప్రతాప్, ఆవులూరి యలమంద, మీగడ ఓబుల్ రెడ్డి, ముల్లా ఖుర్దాస్, యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, షేక్ రసూల్, జ్యోతి మల్లికార్జున, షేక్ మస్తాన్ వలి, కాటూరి శ్రీను, దివ్వల మురళి, వీరిశెట్టి సురేష్, మౌళాలి, షేక్ షబ్బీర్, పోపూరి నరేష్ పాల్గొన్నారు.

తహశీల్దార్‌ను సన్మానించిన క్రిస్టియన్ సొసైటీ

ప్రజాశక్తి - గిద్దలూరు రూరల్

అర్బన్ డెవలప్ మెంట్ క్రిస్టియన్ సంఘం తహాసిల్దారును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సంఘం ప్రెసిడెంట్ డి అబ్రహం మాట్లాడుతూ పట్టణంలో క్రైస్తవులకు ఎకరా ఆరు సెట్లు క్రైస్తవ స్మశానం కొరకు, 20సెంట్లు కమ్యూనిటీ హాలు కొరకు భూమి కేటాయించినదని, త్వరలో క్రైస్తవ స్మశానం, కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేసుకుంటామని, వీటి కేటాయింపుకు సహకరించిన రెవిన్యూ అధికారులకు కతజ్ఞతలు తెలిపారు. తమకు కేటాయించిన స్థలాన్ని సద్వినియోగం చేసుకునేందుకు అందరూ ఐక్యంగా కలిసి రావాలని కోరారు. ఎంతో కాలంగా ఇబ్బంది పడుతున్న తమకు స్మశాన స్థలం, కమ్యునిటీ హాలు నిర్మాణానికి స్థలం కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. స్మశాన స్థలం లేక ఇప్పటి వరకు అనేక ఇబ్బందులు పడ్డట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాస్టర్ ఇమ్మానియేల్ పాల్గొన్నారు.



శనగ పొలంలో తానికొండ సుధాకర్

శనగ పంట పీకేశారని రైతు ఆవేదన

ప్రజాశక్తి - పంగులూరు

తన పొలంలో సాగు చేసుకున్న శనగ పంటను ఉద్దేశపూర్వకంగా అక్రమంగా పీకేసారని ఆరికట్ల వారిపాలెం గ్రామానికి చెందిన రైతు తానికొండ సుధాకర్ ఆరోపించారు. గ్రామంలోని తన పొలంలో శనగ పైరుసాగు చేశానని, పంట పండి మరో రెండు రోజుల్లో పైరు పీకే సమయంలో తన భూమిపక్కనే ఉన్న తానికొండ దయాసాగర్ ఒకటిన్నర సెంటు భూమిలో ఉన్న శనగ పైరును అక్రమంగా పీకాడని పేర్కొన్నారు. తాము అన్నదమ్ములమని, హద్దులు దాటి అక్రమంగా తన పంటను స్వాధీన పర్చుకున్నాడని చెప్పారు. రెండు రోజుల క్రితం రేణింగవరం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని చెప్పారు. అధికారులు ఇప్పటికైనా పరిశీలించి తనకు న్యాయం చేయాలని కోరారు. తన భూమిలో అక్రమంగా పైరును పీకిన దయాసాగర్‌ను కఠినంగా శిక్షించాలని కోరారు.



నరసింహాంకు నివాళులర్పిస్తున్న గునుపూడి బ్రదర్స్

నరసింహంకు నివాళి

ప్రజాశక్తి - పొదిలి

మండలంలోని ఈగలపాడు గ్రామానికి చెందిన పెమ్మన నరసింహం యాదవ్(80)కు గునుపూడి బ్రదర్స్ నివాళి అర్పించారు. తమ కుటుంబానికి చిరకాల మిత్రులైన నరసింహాం వయోభారంతో మృతి చెందగా శనివారం ఎస్‌వికెపి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గునుపూడి చెంచు సుబ్బారావు (జిసి), టడిపి రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, వారి సోదరులు శ్రీసరస్వతి శిశుమందిర్ అధ్యక్షులు గునుపూడి మధుసూధనరావులు నరసంహాం భౌతిక కాయం సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు.



రామన్‌కు జ్ఞాపిక అందజేస్తున్న డీన్ కె రూపఅకేష్

ఐటి రంగంలో అవకాశాలు

ప్రజాశక్తి - టంగుటూరు

ప్రస్తుత ఐటీ రంగం, డేటా సైన్స్‌లో అపారమైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్నాయని చెన్నైకి చెందిన ఐటీ, సాఫ్ట్ వేర్ రంగ నిపుణులు రంగాచారి అచ్యుతరామన్ పేర్కొన్నారు. స్థానిక పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో 'సొసైటీ ఫర్ డేటా సైన్స్ స్టూడెంట్స్ చాప్టర్' ఆవిష్కరణ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన క్లౌడ్ కంప్యూటింగ్ ప్రాముఖ్యత, సాంకేతికతను విద్యార్థులకు వివరించారు. పలువురు విద్యార్థులు లేవనెత్తిన అనుమానాలను నివత్తి చేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ జివికె మూర్తి, స్టూడెంట్స్ డీన్ ఆర్ వీరాంజనేయులు, ప్లేస్ మెంట్ ఆఫీసర్ పాల్గొన్నారు.

ఇంకొల్లు తరలివెళ్లిన టిడిపి శ్రేణులు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

పర్చూరు నియోజకవర్గం ఇంకొల్లులో జరిగిన టిడిపి కదలిరా సభకు బట్టిప్రోలు, ఐలవరం, పల్లెకోన, పెదపూలివర్రు, పెదలంక, వెల్లటూరు తదితర గ్రామాల నుండి బస్సుల ద్వారా కార్యకర్తలను తరలించారు.



సభలో సైకాలజిస్టు సుధీర్‌కుమార్

కష్టపడితేనే మంచి ఫలితాలు

ప్రజాశక్తి - నగరం

శ్రమ నీ ఆయుధమైతే విజయం నీ బానిసవుతుందని వ్యక్తిత్వ వికాస నిపుణులు, సైకాలజిస్ట్ సుధీర్ కుమార్ సాంద్ర అన్నారు. మండలంలోని ఈదుమూడి ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ విద్యార్థినీ, విద్యార్థులకు వ్యక్తిత్వ నైపుణ్యత సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులు ఉన్నత శిఖరాలను అవరోధించడానికి ఉత్తమమైన విలువలను అలవర్చు కోవాలని అన్నారు. రాబోవు పబ్లిక్ పరీక్షలను ఎదురుకోవడానికి కావలసిన మెలుకువలను వివరించారు. కార్యక్రమంలో ముత్తుపల్లి ప్రాథమిక పాఠశాల బాల యేసు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఆక్స్‌ఫర్డ్ స్కూల్ డైరెక్టర్ యోనోబాబు, డీన్ శంకర్, హెచ్‌ఎం నాగరాజు పాల్గొన్నారు.

జంకెను సత్కరించిన సాయి

ప్రజాశక్తి - పొదిలి

ఇటీవల నూతనంగా ఎపి ఐఐసి చైర్మన్‌గా నియమితులైన మార్కాపురం మాజీ ఎమ్మెల్యే, ప్రకాశం జిల్లా వైసీపీ అధినేత జంకె వెంకట రెడ్డిని పొదిలి మాజీ జెడ్పీటీసీ సాయి రాజేశ్వర రావు శనివారం సత్కరించారు. ఒంగోలు వైసిపి కార్యాలయంలో ఆయన జంకెను కలిసి అభినందనలు తెలిపారు.



జంకెను సన్మానిస్తున్న రాజేశ్వరరావు



మారవెంకారెడ్డిని కలిసిన వైసిపి నాయకులు

వెంకారెడ్డిని కలిసిన వైసిపి నేతలు

ప్రజాశక్తి - చీమకుర్తి

వైసిపి రాష్ట్ర కమిటీలో ఎస్టీ సెల్ కార్యదర్శిగా ఎంపికయిన పేరం శ్రీనివాసరావు, సాంస్కృతిక విభాగం ఉపాధ్యక్షులుగా ఎంపికైన పోకూరి రామకృష్ణారెడ్డి అద్దంకి నియోజకవర్గ వైసిపి పరిశీలకులు మారం వెంకారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు.శనివారం వెంకారెడ్డి నివాసంలో కలిసి ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీకి నమ్మకంగా పనిచేసినందుకు గుర్తింపు లభించిందని అన్నారు. కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షులు సిహెచ్ అశోక్, ప్రజాకవి పిన్నిక శ్రీను, పి హనుమంతరావు, డి నాగేశ్వరరావు, పి శ్రీనివాసులరెడ్డి, కడవ రామకృష్ణ, బి వెంకటరావు, విజయభాస్కర్, కోటా రాములు, బడే దశరామిరెడ్డి పాల్గొన్నారు.

నేడు ఎంపీ మాగుంట పర్యటన

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి ఆదివారం వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ఒంగోలు మాగుంట కార్యాలయంలో కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు. సాయంత్రం 5.30 గంటలకు ఒంగోలు బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ దగ్గర ఆంధ్రప్రదేశ్ మాజీ సిఎం, తమిళనాడు మాజీ గవర్నర్ డాక్టర్ కొణిజేటి రోశయ్య కాంస్య విగ్రహ ఆవిష్కరణలో పాల్గొంటారు. రాత్రి 7గంటలకు ఒంగోలు మాగుంట కార్యాలయంలో కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు. మాగుంట అనుచరులు, నాయకులు గమనించి ఆయా కార్యాక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

'బాచిన' టిడిపిలోకి వెళితే వైసీపీకే మేలు

ప్రజాశక్తి - పంగులూరు

మాజీ ఎంఎల్ఏ బాచిన చెంచు గరటయ్య, ఆయన కుమారుడు బాచిన కృష్ణ చైతన్య టిడిపిలోకి వెళ్ళటంతో వైసిపికి మేలు జరిగినట్టైందని, పార్టీకి పట్టిన దరిద్రం వదిలినట్టైందని వైసీపీ నేతలు పేర్కొన్నారు. వీరిద్దరు వైసిపిని వీడి టిడిపిలోకి వెళ్లిన నేపథ్యంలో స్థానిక వైసిపి కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో పలువురు వైసీపీ నాయకులు మాట్లాడారు. మొదటి నుండి గరటయ్య నాయకత్వాన్ని వైసీపీ కార్యకర్తలు వ్యతిరేకిస్తూనే ఉన్నారని అన్నారు. గంటయ్య కాంగ్రెస్‌కు వ్యతిరేకంగానే పనిచేశారని మాజీ ఏఎంసీ చైర్మన్, వైసిపి సేవాదల్ జిల్లా అధ్యక్షులు పులికం కోటిరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ స్వయంపు హనుమంతరావు అన్నారు. 2019ఎన్నికల్లో జగన్ ప్రభంజనంలో కూడా బాచిన చెంచు గరటయ్య 13వేల ఓట్ల తేడాతో ఓడిపోయారని అన్నారు. ఆయనకు ప్రజల్లో ఏమాత్రం అభిమానం ఉందో ఈ ఫలితాలే నిదర్శనమని అన్నారు. వైసిపి ఇన్చార్జి బాధ్యతలు గరటయ్యకు ఇచ్చిన తర్వాత, నిజమైన వైసిపి కార్యకర్తలంతా వైసిపికి దూరమయ్యారని అన్నారు. టిడిపికి చెందిన వారికే పదవులు కట్టబెట్టాడని అన్నారు. టిడిపి కార్యకర్తలను పెంచి పోషించాడని స్వయంపు హనుమంతరావు ఆరోపించారు. తండ్రి, కొడుకులు పార్టీ మారడంతో పార్టీకి పట్టిన దరిద్రం వదిలిపోయిందని అన్నారు. ఎస్సీ సెల్ కన్వీనర్ సందిపోగు రవీంద్ర (బుజ్జి) మాట్లాడుతూ తండ్రి, కొడుకులు పార్టీ మారినంత మాత్రాన వైసిపికి ఎలాంటి నష్టం లేదని అన్నారు. బీసీ సెల్ కన్వీనర్ చక్రవరం భాస్కర్ రాజు మాట్లాడుతూ వైసిపి కార్యకర్తలంతా ఐక్యంగా నిలబడి హనీమిరెడ్డికి అత్యధిక మెజార్టీ వచ్చే విధంగా కృషి చేయాలని అన్నారు. వైసిపి జెండా ఎగురువేయాలని కోరారు. కార్యక్రమంలో వడియరాజుల కార్పొరేషన్ డైరెక్టర్ పల్లపు రాము, ఎంపీపీ తేళ్ల నాగమ్మ, వైసిపి మండల ఇన్చార్జి బెజ్జం శ్రీనివాసరెడ్డి, ప్రచార కమిటీ అధ్యక్షులు లోకిరెడ్డి కృష్ణారెడ్డి, యూత్ అధ్యక్షులు ఆంజనేయులు, గాదె బ్రహ్మారెడ్డి, హరి ప్రసాదరెడ్డి, ఎర్రం గోపాలరెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాజీ ఏఎంసీ చైర్మన్ పులికం కోటిరెడ్డి

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - చీరాల



సీనియర్ సివిల్ జడ్జి ఎం సుధ

న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వచ్చేనెల 9న స్థానిక కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి ఎం సుధ తెలిపారు. ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. రాజీపడదగిన అన్ని సివిల్, క్రిమినల్, ప్రీ లిటిగేషన్ కేసులను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. దీర్ఘకాలికంగా కోర్టుల్లో పెండింగులో ఉన్న కేసులను కక్షిదారులు రాజీమార్గంలో పరిష్కరించుకుంటే సమయంతో పాటుగా డబ్బు ఆదా అవుతుందని తెలిపారు. లోక్ అదాలత్‌లో న్యాయమూర్తులు ఇచ్చే తీర్పులే అంతిమ తీర్పులని తెలిపారు. రాజీలు చేసి పరిష్కరించిన కేసులను కక్షిదారులు ఇతర కోర్టుల్లో అప్పీలు చేసుకునే అవకాశం లేదని తెలిపారు. లోక్ అదాలత్‌లో ఇచ్చిన తీర్పులే అంతిమ తీర్పులుగా పరిగణించబడతాయని తెలిపారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాజీ పడిన కేసుల్లో కట్టిన కోర్టు ఫీజును తిరిగి కక్షిదారులకు చెల్లించనున్నట్లు తెలిపారు.

ఆర్థిక బకాయిలు చెల్లించాలని ధర్నా

ప్రజాశక్తి - పొదిలి

ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్స్, కార్మికులకు చెల్లించవలసిన ఆర్థిక బకాయలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు షేక్ అబ్దుల్ హై అన్నారు. పొదిలి తాలూకా జేఏసీ ఆధ్వర్యంలో తహశీల్దారు కార్యాలయం ఎదురుధర్నా చేశారు. ఈ ధర్నాలో ఆయన మాట్లాడుతూ 11వ పిఆర్‌సి, అరియర్ బకాయిలు రూ.6246కోట్లు, డిఎ బకాయిలు రూ.6020కోట్లు, పిఎఫ్ బకాయిలు రూ.వెయ్యి కోట్లు, ఏపీ జిఎల్ఐ రూ.330కోట్లు, సరెండర్ లీవ్ బకాయిలు రూ.4500కోట్లు, సిపిఎస్ 90 శాతం అరియర్ డిఎ బకాయిలు రూ.2500కోట్లు మొత్తము కలిపి రూ.20,596కోట్లు పెండింగ్ ఉన్నాయని అన్నారు. తక్షణమే చెల్లించాలని అన్నారు. కోవిడ్ 19బారిన పడి మరణించిన ఉద్యోగులు, ఉపాధ్యాయుల కుటుంబాలకు జిల్లా పరిషత్ యాజమాన్యాలలో వెంటనే కారుణ్య నియమాకాలు చేపట్టాలన్నారు. విద్యాశాఖ, వైద్యం ఆరోగ్య శాఖలో యాప్‌లను తగ్గించి జీవో నెంబర్ 147 లింక్ చేయబడిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని అన్నారు. పెన్షనర్స్‌కు అడిషనల్ క్వాంటం పెన్షన్ 7శాతం, 10శాతం, 12శాతం, 15శాతం వర్తింపచేయాలని అన్నారు. పెండింగ్లో ఉన్న 2023 జనవరి, జూలై నెలల డిఏలు వెంటనే మంజూరు చేయాలని అన్నారు. హెల్త్ కార్డుపై అన్ని నెట్‌వర్క్ హాస్పిటల్స్‌లో వైద్య సేవలు అందించాలని అన్నారు. ప్రతి నెల ఒకటిన జీతాలు, పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాలుగున్నరేళ్ల తర్వాత 6000 పోస్టులతో డిఎస్‌సి నోటిఫికేషన్ ఇవ్వటం దారుణమని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 12వేలపైగా ఖాళీలు ఉన్నాయని, జీవో నెంబర్ 117ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 56వేల పోస్టులు రద్దు అవుతున్నాయని, గతంలో ఈ ప్రభుత్వం మేము అధికారం వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ నిర్వహిస్తామని చెప్పి ఈరోజు నిరుద్యోగులను దగా చేసిందని అన్నారు. ఇది దగా డీఎస్సీ అన్నారు. అనంతరం రెవిన్యూసిబ్బందికి వినతిపత్రం అందించారు.




యుటిఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న ఉద్యోగులు

రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - పొదిలి

జగనన్న కాలనీలలో నిర్మాణం చేసుకున్న ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని కనిగిరి ఆర్‌డిఓ జాన్ ఎర్విన్ అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం శనివారం సందర్శించారు. అనంతరం 3వ సచివాలయం తనిఖీ చేశారు. ఫ్రీ హెల్డ్ అసైన్మెంట్ భూముల సర్వేను అధికారులును అడిగి తెలుసుకున్నారు. సాంకేతిక ఇబ్బందులతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కొంత ఆలస్యమైనా వాటిని అధిగమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ ఐ అరుణ, విఆర్వో సురేష్ పాల్గొన్నారు.



తనిఖీ చేస్తున్న కనిగిరి ఆర్‌డిఓ జాన్ ఎర్విన్

టిడిపి బైక్ ర్యాలీ

ప్రజాశక్తి - బాపట్ల

ఇంకొల్లులో టిడిపి అధినేత చంద్ర బాబు కదలి రా సభకు బాపట్ల నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి వేగేసి న నరేంద్ర వర్మ ఆధ్వర్యంలో టిడిపి యువ నాయకులు కుర్రా ధనేంద్ర నాయకత్వంలో 4వందల ద్విచక్ర వాహనాలతో యువకులు ఇంకొల్లు తరలి వెళ్లారు. స్టువర్టుపురం నుండి సుమారుగా 15వేల మంది ప్రత్యేక వాహనాల్లో ఇంకొల్లు బయలుదేరి వెళ్లారు.



బైక్ ర్యాలీలో నరేంద్ర వర్మ




మీడియాతో మాట్లాడుతున్న దేవరపల్లి రంగారావు

సార్వత్రిక సమరానికి సిద్ధం

ప్రజాశక్తి - చీరాల

రానున్న సార్వత్రిక ఎన్నికల సమరానికి కాంగ్రెస్ సిద్ధమౌతున్నట్లు కాంగ్రెస్ ఇన్‌ఛార్జి దేవరపల్లి రంగారావు అన్నారు. దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉందని, దేశానికీ రాహుల్ ప్రధాని ఐతేనే అభివృద్ధి జరుగుతుందని అన్నారు. పట్టణంలోని 8, 9వ వార్డుల ఇన్‌ఛార్జిలను పిసిసి అధ్యక్షురాలు షర్మిల, మాజీ కేంద్ర మంత్రి జెడి శీలం, జిల్లా అధ్యక్షులు గంట అంజిబాబు ఆదేశాల మేరకు నియమించినట్లు తెలిపారు. ఒకప్పుడు చీరాల నీయోజకవర్గం కాంగ్రెస్ కంచు కోటని అన్నారు. ప్రస్తుత ఉన్న క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ సైన్యాన్ని శక్తి వంచన లేకుండా తయారు చేస్తున్నట్లు చెప్పారు. దేశాభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని యువత గుర్తెరగాలని కోరారు. ప్రజలందరూ రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. దేశంలో కాంగ్రెస్ స్థాపించిన ప్రభుత్వ రంగ సంస్థలను బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకు అమ్ము కుంటుందని అన్నారు. బడుగు, బలహీన వర్గాలు అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలని అన్నారు. యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పేర్లి బుజ్జిరాజు, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జూటూరి కుమార్, పట్టణ అధ్యక్షులు బండ్లమూడి విజయ్ కుమార్, కాంగ్రెస్ అధ్యక్షులు యర్రాకుల శ్రీనివాసరావు, ఎస్సి సెల్ అధ్యక్షులు దాసి పీటర్ రమేష్ పాల్గొన్నారు.



విద్యార్థుల నమూనాలతో ఉపాధ్యాయులు

ఆకట్టుకున్న ఎగ్జిబిషన్

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని వెల్లటూరు జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో సోషల్ ఎగ్జిబిషన్ శనివారం నిర్వహించారు. ఎపీ ఎస్-ఎస్‌టిఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా చేపట్టిన ఎగ్జిబిషన్లో విద్యార్థులు వివిధ రకాల నమూనాలు తయారుచేసి ప్రదర్శించారు. భారత పార్లమెంటు, ఎర్రకోట, భట్టిప్రోలు బౌద్ధ స్తూపం, కుతుబ్మినార్, ఈవీఎం వంటి అనేక రకాల నమూనాలను ఎగ్జిబిషన్లో ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం కర్ర అరుణ కుమారి మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఇలాంటి ప్రదర్శనలు దోహదపడతాయని అన్నారు. నిజాంపట్నం ఎంఈఓ శేషు కుమార్ విద్యార్థులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎపీ ఎస్ఎస్‌టిఎఫ్ వ్యవస్థాపకులు మురళీమోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్హులందరికీ స్థలంతో పాటు

ఇంటిని కూడా నిర్మించి ఇస్తాం..

రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే బాలినేని



లబ్ధిదారులతో మాట్లాడుతున్న బాలినేని

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఒంగోలు నగరంలో అర్హత ఉన్న ప్రతి పేదవాడికీ నివేశనా స్థలంతో పాటు ఇంటినీ నిర్మించి ఇస్తామని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఒంగోలులోని సచివాలయాల్లో జరుగుతున్న ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని శనివారం ఆయన స్వయంగా పర్యవేక్షించారు. నగరపాలక సంస్థ పరిధిలోని సచివాలయాలను సందర్శించి, లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పట్టాతో పాటు ఇంటిని కూడా నిర్మించి ఇవ్వాలనే కృతనిశ్చయంతో ఉన్నామని తెలిపారు. ఇంటి పట్టాల పంపిణీకి ఎన్ని అడ్డంకులు సృష్టించినా వాటన్నంటినీ అధిగమించి రిజిస్ట్రేషన్‌ల ప్రక్రియ పూర్తి చేస్తున్నామని తెలిపారు. నాలుగైదు రోజుల్లో ముఖ్యమంత్రి చేతులు మీదుగా అందరికీ పట్టాలు అందజేస్తామని చెప్పారు. పేదల విషయంలో నీచ రాజకీయాలు చేయడం జుగుప్సాకరమన్నారు. చేతనైతే చేయూత నందించాలే తప్ప వారి జీవనానికి అవరోధాలు కలిగించకూడదని హితవు పలికారు. బాలినేని వెంట నగర మేయర్ గంగాడ సుజాత, ఒంగోలు మండల వైసిపి కన్వీనర్ రాయపాటి అంకయ్య, తదితరులు ఉన్నారు.

రోడ్ల మరమ్మతులకు రూ.2.38 కోట్లు

రాష్ట్ర మంత్రి, కొండపి సమన్వయకర్త డాక్టర్ ఆదిమూలపు సురేష్

ప్రజాశక్తి-శింగరాయకొండ

కొండపి నియోజకవర్గంలోని పలు తారు రోడ్ల మరమ్మతుల కోసం నిధులు మంజూరయ్యాయని రాష్ట్ర పురపాలక పట్టణాభివద్ధి శాఖ మంత్రి, కొండపి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఆదిమూలపు సురేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని మొత్తం 27 రోడ్ల మరమ్మతుల కోసం రూ.2 కోట్లా 38 లక్షలు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. త్వరితగతిన పనులు చేపట్టి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామని, ఇవి పూర్తయితే ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందని చెప్పారు. నియోజకవర్గంలో మంజూరైన రోడ్ల వివరాలు. పొన్నలూరు మండలం కందుకూరు రోడ్డు-కె.అగ్రహారం రూ.15 లక్షలు, జరుగుమల్లి మండలం కందుకూరు- వయా కే.అగ్రహారం, మాలపాడు రూ.2 లక్షలు, పొన్నలూరు-ఉప్పలదిన్నె రూ.5 లక్షలు, శింగరాయకొండ-పాకల రూ.10 లక్షలు, పాకల -ఊళ్లపాలెం రూ.8 లక్షలు, టంగుటూరు మడనూరు రోడ్డు రూ.5 లక్షలు, ఎస్బి పాలెం-వేంపాడు రూ.3 లక్షలు, జువ్విగుంట -ఉప్పలపాడు రూ.25 లక్షలు, టీపీ రోడ్డు - విజయలక్ష్మిపేట రూ.10 లక్షలు, రాజుపాలెం-గంగపాలెం రూ.2 లక్షలు, ఓవి రోడ్డు - కామేపల్లి రూ.10 లక్షలు, పెళ్లూరు-వసేపల్లిపాడు రూ.25 లక్షలు, బింగినపల్లి-పెద్దపల్లి పాలెం రూ.3 లక్షలు, టంగుటూరు-తాళ్లపాలెం రూ.20 లక్షలు, శింగరాయకొండ-శానంపూడి రూ.12 లక్షలు, శింగరాయకొండ-కనుమళ్ల రూ.3 లక్షలు, నాగిరెడ్డిపాలెం-చెరుకూరు రూ.25 లక్షలు, టంగుటూరు- పాకల రూ.5 లక్షలు, సంగమేశ్వరం-ఓరుగంటివారిపాలెం రూ.5 లక్షలు, రాజువారిపాలెం రోడ్డు -పశుకుదురు రూ.4 లక్షలు, ఓవీ రోడ్డు-సుంకిరెడ్డిపాలెం రూ.4.25 లక్షలు, శింగరాయకొండ-రామనాథపురం రూ.10 లక్షలు, కొణిజేడు - పొందూరు రూ.5 లక్షలు, మూగచింతల - రామాయపాలెం రూ.10 లక్షలు, కామేపల్లి - ఎన్ఎన్ కండ్రిక రూ.5 లక్షలు, చింతలపాలెం - పంగులూరివారిపాలెం రూ.2 లక్షలు, అనకర్లపూడి - రేగులగడ్డపాలెం రూ.5 లక్షలు మంజూరయ్యాయని, పనులు తక్షణమే మొదలుపెట్టాలని మంత్రి సూచించారు. ఈ నిధులు మంజూరు చేసినందుకు సిఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రానికే కేస్ స్టడీగా పర్చూరు రాజకీయాలు

- దొంగ ఓట్లు చేర్పించి.. గెలుద్దామనుకున్నారు..
- గ్రానైట్ వ్యాపారులపై కేసులు పెట్టి.. వేధించారు..
- టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు



చంద్రబాబుకు జ్ఞాపిక అందజేస్తున్న ఏలూరి



రా..కదలిరా సభకు హాజరైన జనం

ప్రజాశక్తి-ఇంకొల్లు, బాపట్ల జిల్లా

'పర్చూరు రాజకీయాలు రాష్ట్రానికే కేస్ స్టడీ వంటివి. వైసీపీ అధికారంలోకి వచ్చాక పర్చూరులో కబ్జాలు, రౌడీయిజం, దాడులు చేశారు. పర్చూరులో దొంగ ఓట్లు నమోదు చేసి గెలుద్దామని భావించారు. 14 వేల ఫారం-7 దరఖాస్తులు పెట్టారు. ఏలూరి సాంబశివరావు వల్ల ఆమంచి ఇంటికి.. కథ కంచికి చేరింది. పర్చూరు గ్రానైట్ వ్యాపారులపై కేసులు పెట్టి వేధించారు. అధికారులు వైసీపీ మూకలతో వెళ్లి గ్రానైట్ వ్యాపారులను బెదిరించారు. గొట్టిపాటి రవికుమార్‌కు రూ.కోట్లల్లో జరిమానా విధించారు. ఇక బాపట్ల ఎంపీ ఉన్నాడు. కబ్జాలు, బెదిరింపులు, సెటిల్మెంట్లు,ఇవే అతడికి తెలిసింది. చెరుకు తోటలు కాల్చడం తప్ప బాపట్ల ఎంపీకి ఏం తెలుసు? అమరావతి రోడ్లపై మట్టిని కూడా దొంగిలించారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు మీకు రియల్ సినిమా చూపిస్తారు.' అని టిడిపి అధినేత చంద్రబాబునాయుడు అన్నారు. శనివారం ఇంకొల్లులో నిర్వహించిన 'రా ..కదిలి రా' బహిరంగ సభలో చంద్రబాబు ప్రసంగించారు. బటన్లు నొక్కుతున్నానని చెప్పే జగన్ మద్యపాన నిషేధంపై ఎందుకు బటన్ నొక్కలేదని ప్రశ్నించారు. అధికారంలోకి వస్తే వారం రోజుల్లో సీపీఎస్



మాట్లాడుతున్న ఏలూరి, గొట్టిపాటి

రద్దు అన్నారని, మరి ఆ బటన్ ఎందుకు నొక్కలేదని అడిగారు. వైసీపీ పాలనలో ఏటా రూ30 వేల కోట్ల ఆదాయం తగ్గిందని, జగన్ పాలనలో ప్రజల తలసరి ఆదాయం పడిపోయిందని, చెప్పారు. రైతును రాజు చేయడం టీడీపీ-జనసేన ప్రభుత్వానికే సాధ్యమన్నారు.

ఎమ్మెల్యే ఏలూరిని ప్రశంసించిన చంద్రబాబు

ఇంకొల్లులో శనివారం తారకరామా విజయభేరి ప్రాంగణంలో జరిగిన రా కదలిరా సభ దేశం శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంటు అధ్యక్షులు, ఎమ్మెల్యే ఏలూరి ఆధ్వర్యంలో జరిగిన సభకు భారీ సంఖ్యలో ప్రజలు హాజరు కావడంతో పర్చూరు పసుపు కోటగా మారింది. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ ఏలూరి సాంబశివరావు హీరో అంటూ ప్రశంసించారు.

బాపట్ల జిల్లాకు చంద్రబాబు హామీలు

ఇంకొల్లులో జరిగిన రా కదిలిరా సభలో దేశం అధినేత చంద్రబాబు బాపట్ల జిల్లాకు పలు హామీలు ఇచ్చారు. ఇంకొల్లులో ఆటోనగర్ ఏర్పాటు చేస్తామన్నారు. ఇక్కడి ముస్లిం సోదరులకు ఆర్థిక ప్రోత్సాహాలు ఇస్తామన్నారు. పర్చూరు నియోజకవర్గంలో 20 వేల మందికి పక్కాగృహాలు నిర్మించి ఇస్తామని, చేనేతలు అత్యధికంగా ఉన్న చీరాలలో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేస్తామని, చీరాల, బాపట్ల బీచ్ లను అభివద్ధి చేస్తామని చెప్పారు. గుండ్లకమ్మ ప్రాజెక్టును ఆధునీకరించి, గ్రానైట్ పరిశ్రమకు పూర్వ వైభవం తెస్తామన్నారు. రూ 340 కోట్లతో నల్లమడ వాగును ఆధునీకరిస్తామని, జిల్లాలోని పంట కాలవలు, మురికి కాలువలను ఆధునీకరిస్తామని హామీ ఇచ్చారు.

సభలో ఎమ్మెల్యేలు గొట్టిపాటి రవికుమార్, స్వామి, అనగాని సత్యప్రసాద్, ఉండవల్లి శ్రీదేవి, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు, మాజీ ఎంపి శ్రీరాం మాల్యాద్రి, మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, టిడిపి నాయకులు దగ్గుమళ్ల ప్రసాద రావు, ఉగ్ర నరసింహారెడ్డి, దామచర్ల జనార్దన్, వేగేశన నరేంద్రవర్మ, ఎంఎం కొండయ్య, నూకసాని బాలాజీ, జనసేన ప్రకాశం జిల్లా అధ్యక్షులు రియాజ్ పాల్గొన్నారు.



చంద్రబాబుతో కలిసి విక్టరీ చూపిస్తున్న దగ్గుమళ్ల



చంద్రబాబును కలిసిన చీరాల ఇన్‌ఛార్జి కొండయ్య

ఎన్నికల నిర్వహణకు సిద్ధం.!

త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికలను నిర్వహించడానికి అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. నూతనంగా హెూమ్ ఓటింగ్ విధానం అమలులోకి వచ్చిన క్రమంలో ఆ మేరకు చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకోసం అధికారులకు ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నారు. వికలాంగులు, 80 సంవత్సరాలు దాటిన వద్ధులు తమ ఓటు హక్కు ఇంటి వద్దనే వినియోగించుకోవడానికి వీలు కల్పించారు. జిల్లాలో గత ఏడాది జనవరి నుంచి ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులు, తొలగింపులపై 2,08,740 దరఖాస్తులు అందాయి. వాటిలో 32,056 దరఖాస్తులను తిరస్కరించారు. ఓటర్ల జాబితాలో మతుల పేర్లు తొలగించలేదని వస్తున్న ఆరోపణలపై విచారణ జరిపారు. ఇప్పటికే 50 మంది బిఎల్‌ఓలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఓటర్ల ఫొటోలు డబుల్ ఎంట్రీలు, మృతుల ఓట్ల తొలగింపులో నిర్లిప్తంగా వ్యవహరించిన వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటున్నారు. ఒకే పోలింగ్ కేంద్రంలో 1,500 మందికి మించి ఓటర్లు ఉంటే అలాంటి ప్రాంతాల్లో ఓటర్ల సౌలభ్యం కోసం రెండో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తున్నారు.



రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, కార్మికులకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలన్న ప్రధాన డిమాండ్లతో పాటు కేంద్రంలో బిజెపి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తూ శుక్రవారం చేపట్టిన దేశవ్యాప్త కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌లో అన్ని వర్గాల ప్రజలూ పాల్గొన్నారు. రైతులు, కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో.. వారికి ఇచ్చిన హామీలు అమలుచేయడంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టి, పారిశ్రామిక రంగాన్ని ప్రయివేటుపరం చేస్తూ కేంద్ర ప్రభుత్వం దేశ సంపదను కొల్లగొడుతుందని కార్మిక సంఘాల నేతలు బంద్ సందర్భంగా కేంద్రం తీరును దుయ్యబట్టారు.

ప్రకాశం జిల్లాలోని పొదిలిలో జరిగిన జన విజ్ఞాన వేదిక రాష్టస్థాయి కళాజాతా విద్యార్థులు, యవతలో విజ్ఞానాన్ని పెంపొందింపజేసింది. ప్రశ్నించడం ద్వారానే సమాజం మార్పు చెందుతుందని, ప్రజాస్వామిక వాతావరణం లేకుండా ప్రశ్న ఉండదని, ప్రశ్న లేకుంటే సైన్సు, శాస్త్రీయ దక్పథం లేదన్న విషయాల గురించి కళాజాత ద్వారా తెలియజేశారు. ప్రతి విద్యార్థిలో కళలు నిద్రాణమై ఉంటాయని, వాటిని వెలికి తీసి, వారి ప్రతిభను ప్రపంచానికి చాటేందుకు జన విజ్ఞాన వేదిక చేస్తున్న కషిని పలువురు ఈసందర్భంగా అభినందించారు.

తుపాను కారణంగా పంట నష్టపోయిన రైతులు రాష్ట్రప్రభుత్వం నుంచి నష్టపరిహారం కోసం ఎదురుచూస్తున్నారు. తుపాను అనంతరం వ్యవసాయశాఖ అధికారులు రూపొందించిన తుది నివేదిక ప్రకారం జిల్లాలో 1,17,960 ఎకరాల్లో వరి పంటకు, 25,452 ఎకరాల్లో ఇతర పంటలకు నష్టం వాటిల్లినట్లు తేల్చారు. 81,965 మంది రైతులు రూ.91 కోట్ల మేర పంటను నష్టపోయినట్లు హెక్టారుకు రూ 15 వేలు వంతున లెక్కలు కట్టారు. రాష్ట్రప్రభుత్వం నుంచి పంట నష్టపరిహారం నేటికి విడుదల కాకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వైసిపి, టిడిపిల తరపున ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో ఏ పార్టీ తరపున ఎవరు పోటీ చేయన్నారనే విషయమై స్పష్టత వచ్చింది. అందరిలో ఉత్కంఠను పెంచిన ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గం టిక్కెట్ వ్యవహారం కూడా తేలిపోయింది. సిట్టింగ్ ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డే ఇక్కడ నుంచి పోటీ చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఒంగోలులో 22 వేల మందికి పట్టాలిచ్చేందుకు రంగం సిద్ధం చేశారు. ఈ నెల 20న సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ద్వారా పేదలకు పట్టాలిచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డిని వైసిపి పక్కన పెట్టింది. ఈయన టిడిపి నుంచి పోటీ చేస్తారా లేక మరో మార్గమేదైనా ఎంచుకుంటారా అనేది తేలాల్సి ఉంది. తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో పర్చూరు నియోజకవర్గం ఇంకొల్లులో 'రా..కదలిరా' సభకు మాజీ సిఎం, టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు శనివారం విచ్చేశారు. రాష్ట్ర ప్రభుత్వ తీరును దుయ్యబట్టారు. వచ్చేది టిడిపి-జనసేన ప్రభుత్వమేనని చెప్పారు.

- ప్రజాశక్తి, బాపట్ల జిల్లా